NRT
AP Non Resident Telugu Society

E - Magazine
July 2026 Edition



# కేంద్ర - రాష్ట్ర సమన్వయానికి కొత్త ఊపు

**చంద్రబాబు–నిర్మలా భేటీ... అభివృద్ధి, పెట్టుబడులు, ప్రజా సంక్షేమంపై కీలక చర్చలు**

NRT
AP Non Resident Telugu Society

Andhra Pradesh Non - Resident Telugu Society
(An Entity of Govt of AP)

# » విషయ సూచిక

విషయం | పేజి నెం.


» కేంద్ర - రాష్ట్ర సమన్వయానికి కొత్త ఊపు 3

» పట్టాలపై భారత హైడ్రోజన్ విప్లవం 5

» రాజధాని- అమరావతి

» 2,534 కోట్ల రూపాయలతో అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్ 9

» ప్రవాసాంధ్ర వైభవం

» పోలాండ్ తెలుగు అసోసియేషన్ (PoTA) తెలుగు సంస్కృతికి చిరునామా... సేవకు మరో పేరు 10

» APNRT వార్తలు

» మైగ్రెంట్ రిసోర్స్ సెంటర్ (MRC) APNRT సొసైటీ 24/7 హెల్ప్‌లైన్ — జూలై 2026 అప్డేట్ 13

» ప్రవాసాంధ్రుల సంక్షేమం ప్రత్యేక ప్రతినిధులు 15

» ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తరపున ప్రపంచ వ్యాప్తంగా కో ఆర్డినేటర్లను నియమించిన APNRT 15

» ఆంధ్రప్రదేశ్ పర్యాటకం - మేఘాలను తాకే మనోహర ప్రదేశం హార్స్లీ హిల్స్ 16

» విదేశీ చట్టాలు - శిక్షలు

» ప్రవాసాంధ్రులకు హెచ్చరిక కువైట్లో ఎంప్లాయిూ కార్డు లేకుండా ఉద్యోగం చేస్తున్నారా? 19

» ఆంధ్ర సాహిత్యం - భావాలకు చిరునామా దేవులపల్లి కృష్ణశాస్త్రి 21

» పండుగలు విశేషాలు - గురు పౌర్ణమి విశిష్టత 24

» ప్రత్యేక వ్యాసం

యూఏపీఏ (UAPA) చట్టం — భారతదేశ ఉగ్రవాద నిరోధక చట్టం 26

» మేధో మథనం

దాన గుణం - గొప్ప వరం గొప్పల కోసం కాకుండా బాధ్యతతో దానం చేయండి 29

» సమస్య-పరిష్కారం - ఎన్ఆర్ఐ ఫిర్యాదుపై తక్షణ విచారణ 31

» దూర దేశం వియత్నాంలో విషాదం 32

» మన వంటలు - కాకినాడ కాజా (గొట్టం కాజా) 36

» ఆస్ట్రేలియా సెన్సస్ 2026 : మన తెలుగు భాషా వైభవాన్ని, ఐక్యతా బలాన్ని చాటుకుందాం! 37





info@apnrts.com www.apnrts.ap.gov.in /APNRTSOCIETY /APNRTSOfficial 24/7 APNRTS హెల్ప్ లైన్ +91 863 2340678 +91 85000 27678

# కేంద్ర-రాష్ట్ర సమన్వయానికి కొత్త ఊపు

» చంద్రబాబు—నిర్మలా భేటీ...
అభివృద్ధి, పెట్టుబడులు, ప్రజా సంక్షేమంపై కీలక చర్చలు

» నరసరావుపేటలో మెగా రుణమేళా — లక్ష మందికిపైగా
లబ్ధిదారులకు ₹3,216 కోట్ల రుణాల పంపిణీ



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆంధ్రప్రదేశ్ పర్యటనలో రాష్ట్ర ప్రభుత్వం—కేంద్ర ప్రభుత్వాల మధ్య సమన్వయానికి ప్రాధాన్యం సంతరించుకున్న పరిణామాలు చోటుచేసుకున్నాయి. విజయవాడ సమీపంలోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్లు నిర్మలా సీతారామన్ మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, ఆర్థిక సహకారం, మౌలిక వసతుల ప్రాజెక్టులు, సంక్షేమ కార్యక్రమాల అమలు వంటి అంశాలపై చర్చించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.

## నరసరావుపేటలో మెగా క్రెడిట్ అవుట్రీచ్ కార్యక్రమం

పల్నాడు జిల్లా నరసరావుపేటలో వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన క్రెడిట్ అవుట్రీచ్ ప్రోగ్రామ్లో సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ వర్గాలకు చెందిన లక్ష మందికిపైగా లబ్ధిదారులకు ₹3,216 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో



నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ ప్రజలు బ్యాంకులకు రావడం కోసం వేచి ఉండకుండా, బ్యాంకులే ప్రజల వద్దకు వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణాలు, ఆర్థిక సేవలు అందించాలని సూచించారు. ఆర్థిక చేరిక (Financial Inclusion)ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆమె నొక్కి చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి ప్రాధాన్యతలను కేంద్ర మంత్రికి వివరించారు. ముఖ్యంగా ఆక్వా రంగానికి సంబంధించిన రొయ్యల మేత (Shrimp Feed) వ్యయాన్ని తగ్గించేందుకు కేంద్రం సహకరించాలని, దేశీయ మార్కెట్లను ప్రోత్సహించే చర్యలు తీసుకోవాలని కోరినట్లు సమాచారం. రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు, పారిశ్రామికాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ మౌలిక వసతుల విస్తరణ వంటి అంశాలపై కూడా చర్చలు జరిగినట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. బ్యాంకింగ్ సేవల విస్తరణ, పారిశ్రామిక పెట్టుబడులు, వ్యవసాయం, ఆక్వా రంగం, ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాలపై ఇరు ప్రభుత్వాల సమన్వయం రానున్న రోజుల్లో మరింత వేగం అందుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.





info@apnrts.com
www.apnrts.ap.gov.in
/APNRTSOCIETY
/APNRTSOfficial
24/7 APNRTS హెల్ప్ లైన్
+91 863 2340678
+91 85000 27678

# పట్టాలపై భారత హైడ్రోజన్ విప్లవం

## » భారత ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభమైన హైడ్రోజెన్ ఇంధనంతో నడిచే రైలు




పట్టాలపై భారత హైడ్రోజన్ విప్లవం – భారత ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభమైన హైడ్రోజెన్ ఇంధనంతో నడిచే రైలు 2026 జూలై 17న భారతదేశం ఒక కొత్త సాంకేతిక యుగంలోకి అడుగుపెట్టింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉత్తర రైల్వే పరిధిలోని జింద్–సోనిపట్ మార్గంలో దేశంలోనే తొలిసారిగా స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన హైడ్రోజన్ ఇంధనంతో నడిచే ప్రయాణికుల రైలును ప్రారంభించారు.ఇది కేవలం భారత ఇంజినీరింగ్ సామర్థ్యానికి మరో మైలురాయి మాత్రమే కాదు; ప్రపంచం వేగంగా అడుగులు వేస్తున్న స్వచ్ఛ ఇంధన సాంకేతికత (Clean Energy Technology) రంగంలో భారతదేశం అధికారికంగా ప్రవేశించిన చారిత్రక ఘట్టం కూడా.హైడ్రోజన్తో నడిచే ప్రయాణికుల రైలును స్వయంగా రూపకల్పన చేసి, అభివృద్ధి చేసి, విజయవంతంగా నడిపిన దేశాల జాబితాలో ఇప్పుడు జర్మనీ, ఫ్రాన్స్, జపాన్, చైనా, అమెరికా సరసన భారతదేశం కూడా చేరింది. ఇది భారతదేశ సాంకేతిక స్వావలంబనకు, పరిశోధనా సామర్థ్యానికి నిదర్శనం. అయితే ఈ విజయానికి అసలు ప్రాధాన్యం కేవలం కొత్త రైలును ప్రారంభించడంలో లేదు. ఇప్పటికే ప్రపంచంలో అత్యధికంగా విద్యుదీకరించబడిన రైల్వే నెట్వర్క్లలో ఒకటైన భారత రైల్వేకు హైడ్రోజన్ ఇంధనం భవిష్యత్తులో ఎలాంటి పాత్ర పోషించాలి? అనే కీలకమైన ప్రశ్నకు ఇది నాంది పలుకుతోంది. అందుకే ఈ ప్రారంభోత్సవాన్ని కేవలం ఒక రవాణా




వార్తగా కాకుండా, భారతదేశ భవిష్యత్ ఇంధన భద్రత, హరిత సాంకేతికత మరియు జాతీయ సాంకేతిక వ్యూహానికి సంబంధించిన ఒక కీలక అధ్యాయంగా చూడాలి. పట్టాలపై పరుగులు తీస్తున్న ఈ హైడ్రోజన్ రైలు నిజానికి కేవలం ప్రయాణికులను మాత్రమే కాదు... భారతదేశాన్ని సుస్థిర అభివృద్ధి, స్వచ్ఛ ఇంధన వినియోగం, సాంకేతిక స్వావలంబన వైపు కూడా తీసుకెళ్తున్న కొత్త యుగానికి ప్రతీక.

ప్రపంచవ్యాప్తంగా హైడ్రోజన్ రైలు సాంకేతికత ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. ఇది పూర్తిగా పరిపక్వత సాధించిన సాంకేతికత కాకపోయినా, పలు దేశాలు దీనిని భవిష్యత్ హరిత రవాణా వ్యవస్థగా అభివృద్ధి చేస్తున్నాయి.జర్మనీ 2018లో ప్రపంచంలోనే తొలిసారిగా వాణిజ్యపరంగా హైడ్రోజన్ రైలు సేవలను ప్రారంభించి ఈ రంగానికి మార్గదర్శకంగా నిలిచింది. ప్రస్తుతం అక్కడ ప్రాంతీయ రైలు మార్గాల్లో హైడ్రోజన్ రైళ్ల వినియోగాన్ని క్రమంగా విస్తరిస్తున్నారు.చైనా ఆధునిక కమ్యూటర్ రైలు వ్యవస్థల్లో హైడ్రోజన్ ప్రొపల్షన్ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తోంది. జపాన్ అభివృద్ధి చేసిన 'హైబారి (Hybari)' నమూనా రైలు, టయోటా ఫ్యూయల్ సెల్ సాంకేతికతను ఆధునిక బ్యాటరీ వ్యవస్థలతో సమన్వయం చేసి రూపొందించబడింది. అదే విధంగా, అమెరికా సుదూర ప్రయాణాలకు అనువైన హైడ్రోజన్ రైళ్లను పరీక్షించి, వాటి సామర్థ్యాన్ని విజయవంతంగా ప్రదర్శించింది.ఈ అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో భారతదేశం సాధించిన విజయం ప్రత్యేకమైనది. ప్రపంచంలో ప్రస్తుతం సేవలందిస్తున్న హైడ్రోజన్ రైళ్లలో చాలా వరకు రెండు నుంచి నాలుగు కోచ్లతో మాత్రమే నడుస్తున్నాయి. అయితే భారతదేశం పది కోచ్లతో కూడిన హైడ్రోజన్ ప్రయాణికుల రైలును అభివృద్ధి చేయడం ద్వారా ప్రపంచంలోనే అతిపెద్ద హైడ్రోజన్ రైలు సముదాయాల్లో (Trainsets) ఒకటిగా నిలిచింది. ఇది భారతీయ ఇంజినీరింగ్ సామర్థ్యంపై ఉన్న విశ్వాసాన్ని మాత్రమే కాకుండా, 'ఆత్మనిర్భర్ భారత్' (స్వావలంబన భారత్) లక్ష్యం, అలాగే జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ (National Green Hydrogen Mission) పట్ల దేశం చూపుతున్న దృఢ నిబద్ధతను కూడా ప్రతిబింబిస్తోంది.




ఈ విజయంతో భారత్ ప్రపంచాన్ని అనుసరించే దేశంగా కాకుండా, ప్రపంచ ధోరణులను నిర్దేశించే, భవిష్యత్ హరిత సాంకేతికతకు దిశానిర్దేశం చేసే దేశంగా ఎదుగుతున్నదని ఈ ప్రాజెక్టు స్పష్టంగా చాటిచెబుతోంది.

జింద్–సోనిపట్ హైడ్రోజన్ రైలు ప్రాజెక్టు అసలైన ప్రాధాన్యం కేవలం రైల్వే రంగానికే పరిమితం కాదు. ఇది భారతదేశ హైడ్రోజన్ ఆర్థిక వ్యవస్థకు తొలి భారీ ప్రయోగశాల (Learning Laboratory) గా నిలుస్తోంది.

### ఈ ప్రాజెక్టు ద్వారా భారత్ కింది రంగాల్లో విలువైన అనుభవాన్ని సంపాదిస్తోంది:

- హైడ్రోజన్ ఉత్పత్తి
- నిల్వ వ్యవస్థలు
- ఇంధన నింపే సాంకేతికత
- నిర్వహణ (Maintenance)
- భద్రతా ప్రమాణాలు
- వ్యవస్థల సమన్వయం
- నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధి

ఈ అనుభవం భవిష్యత్తులో బస్సులు, భారీ ట్రక్కులు, నౌకాశ్రయాలు, నౌకాయానం, పారిశ్రామిక తయారీ రంగం, స్వచ్ఛ ఇంధన వ్యవస్థలు వంటి అనేక రంగాలకు ఉపయోగపడుతుంది.ప్రపంచంలో హైడ్రోజన్ సాంకేతికతపై నేడు పట్టు సాధించే దేశాలే, రేపటి ఇంధన మార్కెట్లు, పారిశ్రామిక పోటీ సామర్థ్యం, సాంకేతిక ప్రమాణాలను నిర్ణయించే స్థాయికి చేరుకుంటాయి. అందువల్ల భారతదేశపు తొలి హైడ్రోజన్ రైలును కేవలం విద్యుత్ రైళ్లకు ప్రత్యామ్నాయంగా లేదా ఒక ఇంజినీరింగ్ విజయంగా మాత్రమే చూడకూడదు. ఇది భారతదేశ భవిష్యత్తు సాంకేతిక సామర్థ్యంలో చేసిన వ్యూహాత్మక పెట్టుబడి. జింద్–సోనిపట్ మధ్య పరుగులు తీస్తున్న ఈ రైలు హైడ్రోజన్తో నడుస్తున్నప్పటికీ, దానిని ముందుకు నడిపిస్తున్న అసలైన శక్తి భారతదేశం 21వ శతాబ్దపు కీలక సాంకేతిక రంగాల్లో ప్రపంచానికి నాయకత్వం వహించాలనే సంకల్పం.

Arja Sreekanth


NRT
AP Non Resident Telugu Society
ప్రవాసాంధ్రుల సంక్షేమమే
APNRTS లక్ష్యం
ఉచిత సభ్యత్వంతో పొందే సేవలు
ప్రవాసాంధ్ర భరోసా బీమా
ఇంపోర్ట్ & ఎక్స్‌పోర్ట్ గైడెన్స్
పుణ్యక్షేత్రాల్లో VIP దర్శనాలు
ఇండియాకు తిరిగి రావడానికి సహాయం
ఉచిత అంబులెన్స్ సేవలు, ఇతర సేవలు
QR స్కాన్ చేసి ఫ్రీ మెంబెర్ షిప్ పొందండి.
24/7
పూర్తి సమాచారం కోసం మా హెల్ప్ లైన్ నెంబర్లను సంప్రదించగలరు.
+91 8632340678 | +91 8500027678 | support@apnrts.com | www.apnrts.ap.gov.in

# 2,534 కోట్ల రూపాయలతో అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్



ఆంధ్రప్రదేశ్ ప్రజల కలల రాజధాని అమరావతి అభివృద్ధిలో పథంలో దూసుకుపోతుంది. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమరావతిలో కీలక ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. 2,534 కోట్ల రూపాయలతో అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలకు కేంద్ర క్యాబినెట్ పచ్చ జెండా ఊపింది. అమరావతిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు కొలువు తీరేందుకు 1,299 కోట్లతో సెంట్రల్ సెక్రటేరియట్ భవనం మరో 1,235 కోట్లతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం నివాస సముదాయాన్ని నిర్మించనున్నారు. ఈ మేరకు కేంద్ర గృహ నిర్మాణ సంస్థ చేసిన ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సెక్రటేరియట్ కోసం 5.53 ఎకరాలు, నివాస సముదాయం కోసం 17 ఎకరాలను AP CRDA కేటాయించింది. ఢిల్లీ తరువాత ఈ స్థాయిలో సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణం అమరావతిలోనే జరుగనుంది. దీనికోసం కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసేందుకు కృషి చేశారు. అమరావతిలో ఇప్పటికే పలు కేంద్ర ప్రభుత్వ విభాగాలు, వాటి అనుబంధ సంస్థలు పనిచేస్తున్నాయి. ప్రస్తుతం ఇవన్నీ అద్దె భవనాల్లో నడుస్తుండగా సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణం పూర్తి అయితే ఇవన్నీ ఈ భవనంలోకి మారే అవకాశం ఉంది.

## పోలాండ్ తెలుగు అసోసియేషన్ (PoTA)

# తెలుగు సంస్కృతికి చిరునామా... సేవకు మరో పేరు



యూరప్ నడిబొడ్డున ఉన్న పోలాండ్లో నివసిస్తున్న తెలుగు కుటుంబాల మధ్య ఐక్యతను పెంపొందించడం, తెలుగు భాషా సంస్కృతులను భావితరాలకు అందించడం, సామాజిక సేవను జీవిత విధానంగా మార్చడం అనే లక్ష్యాలతో శ్రీ హరి చంద్ కాట్రగడ్డ, శ్రీ అక్కల చంద్రభాను కలిసి Poland Telugu Association (PoTA) 2023 లో స్థాపించారు. Poland Telugu Association (PoTA) పోలిష్ ప్రభుత్వంలో అధికారికంగా నమోదు చేయబడిన తెలుగు సేవా సంస్థగా, పోలాండ్లోని తెలుగు సమాజానికి విశ్వసనీయమైన వేదికగా కొనసాగుతోంది.

కొద్దిమంది సభ్యులతో ప్రారంభమైన PoTA, నేడు పోలాండ్లో నివసిస్తున్న వందలాది తెలుగు కుటుంబాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, సాంస్కృతిక, సామాజిక, సేవా కార్యక్రమాల్లో విశేష పాత్ర పోషిస్తున్న ప్రముఖ తెలుగు సంస్థగా ఎదిగింది.

PoTA కార్యకలాపాలు కేవలం వార్సా లోనే కాకుండా క్రాకోవ్, గ్డాన్స్క్ తో పాటు ఇతర నగరాల్లోని స్థానిక చాప్టర్ల ద్వారా పోలాండ్లో నివసిస్తున్న తెలుగు కుటుంబాలందరినీ ఒకే వేదికపైకి తీసుకువస్తూ, దేశవ్యాప్తంగా ఐక్యతను బలోపేతం చేస్తోంది. ప్రాంతాలకు అతీతంగా ప్రతి తెలుగు కుటుంబాన్ని కలుపుతూ, "ఒకే తెలుగు



కుటుంబం" అనే భావనతో ముందుకు సాగుతోంది.

సంస్కృతి, సేవ, సమాజం అనే సూత్రాలతో పూర్తిగా వాలంటీర్ల సహకారంతో ముందుకు సాగుతున్న PoTA, ప్రతి తెలుగు కుటుంబానికి ఒక ఆత్మీయ కుటుంబంగా నిలుస్తోంది.



## మన సంస్కృతి... మన గర్వం

తెలుగు భాష, సంప్రదాయాలు, కుటుంబ విలువలను భావితరాలకు అందించడం PoTA ప్రధాన లక్ష్యం. దీనిలో భాగంగా .ప్రతి సంవత్సరం సంక్రాంతి సంబరాలు, ఉగాది మహోత్సవం , బతుకమ్మ & దసరా వేడుకలు, దీపావళి, వినాయక చవితి, శ్రీ వేంకటేశ్వర కళ్యాణ మహోత్సవం, పిల్లల సాంస్కృతిక వేడుకలు వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుంది.

ఈ కార్యక్రమాలు కేవలం వేడుకల కోసం మాత్రమే కాదు; విదేశాల్లో పెరుగుతున్న తెలుగు పిల్లలకు తమ మూలాలను పరిచయం చేసే సాంస్కృతిక పాఠశాలలుగా నిలుస్తున్నాయి. విదేశాల్లో అనుకోని అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు తెలుగు కుటుంబాలకు అండగా నిలవడం PoTA యొక్క ప్రధాన సేవా లక్ష్యాల్లో ఒకటి. అనారోగ్యం, ప్రమాదాలు మరియు ఇతర క్లిష్ట పరిస్థితుల్లో అవసరమైన సహాయంతో




పాటు, ఇప్పటివరకు పోలాండ్లో మరణించిన పలువురు భారతీయుల భౌతిక దేహాలను వారి స్వస్థలాలకు గౌరవప్రదంగా తరలించే ప్రక్రియలో కుటుంబ సభ్యులు, భారత రాయబార కార్యాలయం మరియు స్థానిక అధికారులతో సమన్వయం చేస్తూ PoTA విజయవంతంగా సహకారం అందిస్తూ వస్తోంది. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం PoTA తన సామాజిక బాధ్యతగా భావిస్తుంది.

Poland Telugu Association (PoTA)లో ప్రతి నెల నిర్వహించే "PoTA Seva Sunday" ఈ సంస్థకు ప్రత్యేక గుర్తింపు తెచ్చి పెట్టింది. సమాజానికి తిరిగి ఇవ్వాలనే సంకల్పంతో ప్రతి నెల వాలంటీర్లు కలిసి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంతటితో పరిమితం కాకుండా, క్రిస్మస్ సందర్భంగా అనాథాశ్రమాల్లోని చిన్నారులకు బహుమతులు అందజేసి వారి ఆనందంలో భాగస్వామ్యం కావడం, అలాగే స్థానిక స్వచ్ఛంద సంస్థలతో కలిసి వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా PoTA మానవతా విలువలను ఆచరణలో చూపిస్తోంది.

## PoTA నమ్మకం:
## పోలాండ్ – అవకాశాల దేశం

గత రెండు దశాబ్దాల్లో పోలాండ్ యూరప్లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలిచింది. యూరోపియన్ యూనియన్లో కీలక సభ్యదేశమైన పోలాండ్, విద్య, ఉపాధి, పరిశ్రమలు మరియు సాంకేతిక రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతిభను ఆకర్షిస్తోంది. నేడు వేలాది మంది భారతీయులు, అందులో గణనీయమైన సంఖ్యలో తెలుగు కుటుంబాలు, ఉద్యోగాలు, ఉన్నత విద్య, వ్యాపారాల్లో విజయవంతంగా స్థిరపడ్డారు.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బ్యాంకింగ్ ఫైనాన్స్ సేవలు, ఇంజనీరింగ్, ఆటోమొబైల్, హెల్త్ కేర్ తదితర రంగాల్లో ప్రవాసులు పోలాండ్ లో మెరుగైన అవకాశాలున్నాయి భద్రతా పరంగా పోలాండ్ ముందు వరుసలో ఉంటుంది. పరిశుభ్రమైన నగరాలు, అత్యుత్తమ ప్రజా రవాణా , ఉన్నత జీవన ప్రమాణాలు, కుటుంబాలకు అనుకూల వాతావరణం, Work-Life Balance కోరుకునే వారు పోలాండ్ ను ఎంచుకోవచ్చు.

పోలాండ్కు కొత్తగా వచ్చే తెలుగు వారి కోసం PoTA ఎల్లప్పుడూ తోడుగా ఉంటుంది. నివాసంపై మార్గదర్శకం, ఉద్యోగ సమాచారం, విద్యార్థులకు సహాయం, స్థానిక చట్టాలు, జీవన విధానంపై అవగాహన, అ త్యవసర పరిస్థితుల్లో సహకారం, భారత రాయబార కార్యాలయం మరియు స్థానిక అధికారులతో సమన్వయం, కమ్యూనిటీ నెట్వర్కింగ్ వంటి విషయాలలో సహాయం కోసం PoTAను సంప్రదించవచ్చు.

### ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ

# మైగ్రెంట్ రిసోర్స్ సెంటర్ (MRC)

## APNRT సొసైటీ 24/7 హెల్ప్‌లైన్ – జూలై 2026 అప్డేట్




ఆంధ్రప్రదేశ్ నాన్-రెసిడెంట్ తెలుగు సొసైటీ (APNRTS) యొక్క 24/7 హెల్ప్లైన్ సంస్థకు ముఖచిత్రంలా పనిచేస్తూ, సంవత్సరానికి 365 రోజులు, 24 గంటలు నిరంతరం అందుబాటులో ఉంటుంది. ఈ హెల్ప్లైన్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రవాసులు (NRTs) యొక్క సమస్యలను పరిష్కరించడం, వారి అవసరాలను తీర్చడం, అవసరమైనప్పుడు సలహాలు మరియు సూచనలు ఇవ్వడం జరుగుతుంది. సగటున ప్రతి నెల 2,500కు పైగా కాల్స్ అందుకుంటూ, CRM మరియు WhatsApp కాల్స్ సహా సేవలు అందిస్తోంది.

జూలై 2026 నెలలో, NRTల అవసరాలను తీర్చడానికి మొత్తం 2,322 కాల్స్ హెల్ప్లైన్ సిబ్బంది అటెండ్ చేశారు.

| | |
|---|---|
| మొత్తం కాల్స్ | : 2322 |
| ఇన్కమింగ్ కాల్స్ | : 890 |
| అవుట్బౌండ్ కాల్స్ | : 250 |
| వాట్సాప్ కాల్స్ | : 1182 |

MRC ఫిర్యాదులు (Grievances) –ఆంధ్రప్రదేశ్ నాన్-రెసిడెంట్ తెలుగు సొసైటీ (APNRTS) హెల్ప్లైన్ ద్వారా ప్రతి నెల సగటున 25కు పైగా ఫిర్యాదులు అందుతుంటాయి. ఈ ఫిర్యాదులు ప్రధానంగా ఇబ్బందుల్లో ఉన్న NRT మైగ్రెంట్స్, వారి కుటుంబ సభ్యులు, ప్రభుత్వ విభాగాలు, ప్రజాప్రతినిధులు, జిల్లా పరిపాలన అధికారుల నుండి వస్తాయి. "MRC Grievances" అనేది APNRTS అందించే ఉచిత సేవ. ఇది ఇబ్బందుల్లో

ఉన్న మైగ్రెంట్స్ మరియు వారి కుటుంబాలకు సహాయం చేయడానికి రూపొందించబడింది.

## పరిష్కార విధానం

ఫిర్యాదు స్వభావాన్ని బట్టి మైగ్రెంట్ ఉన్న దేశంలోని భారత రాయబార కార్యాలయానికి (Embassy of India) అధికారిక లేఖ/ఈమెయిల్ పంపబడుతుంది. కేసు వివరాలు తెలియజేసి, ప్రస్తుత పరిస్థితి తెలుసుకొని, అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటారు. ముఖ్యంగా వ్యక్తిని సురక్షితంగా భారతదేశానికి తిరిగి తీసుకురావడం (Repatriation) పై దృష్టి ఉంటుంది. జూన్ 2026 నెలలో మొత్తం 24 వివిధ MRC ఫిర్యాదులు అందాయి. వాటి ప్రస్తుత స్థితి (status) ప్రకారం తగిన చర్యలు కొనసాగుతున్నాయి. MRC ఫిర్యాదు సేవలు విదేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలుగు మైగ్రెంట్స్కు ఒక అత్యంత కీలక సహాయక వ్యవస్థగా నిలుస్తున్నాయి.

## MRC ఫిర్యాదులు వివరాలు - జూలై 2026:

ఆంధ్రప్రదేశ్ నాన్-రెసిడెంట్ తెలుగు సొసైటీ (APNRTS) విదేశాల్లో మరణించిన మైగ్రెంట్ల మృతదేహాలను లేదా అత్యంత తీవ్ర అనారోగ్యంతో ఉన్న స్ట్రెచర్పై ప్రయాణించాల్సిన రోగులను విమానాశ్రయం నుండి వారి స్వగ్రామం లేదా నివాస ప్రాంతానికి తరలించేందుకు ఉచిత అంబులెన్స్ సేవను అందిస్తోంది. ఈ సేవ ద్వారా బాధిత కుటుంబాలకు అత్యవసర సమయంలో సహాయం అందిస్తూ, మృతదేహాలను గౌరవప్రదంగా ఇంటికి చేర్చే బాధ్యతను సంస్థ తీసుకుంటోంది. జూలై 2026 నెలలో APNRTS మొత్తం 21 ఉచిత అంబులెన్స్ సేవలను అందించింది.

ఆంధ్రప్రదేశ్ నాన్-రెసిడెంట్ తెలుగు సొసైటీ (APNRTS) అందిస్తున్న టెంపుల్ ట్రావెల్ సేవ ద్వారా విదేశాల్లో నివసించే తెలుగు ప్రవాసులు (NRTs) తమ సెలవుల్లో స్వదేశానికి వచ్చినప్పుడు ఆంధ్రప్రదేశ్లోని పవిత్ర తీర్థక్షేత్రాలను దర్శించేందుకు ప్రత్యేక సహాయం అందించబడుతుంది. ఈ సేవలో భాగంగా రాష్ట్రంలోని ప్రముఖ 8 దేవాలయాలకు VIP దర్శనం సౌకర్యం మరియు వసతి ఏర్పాట్లు కల్పించబడుతున్నాయి. ఈ సేవ ద్వారా భక్తులు సౌకర్యవంతంగా మరియు ఆధ్యాత్మికంగా తమ యాత్రను పూర్తిచేసుకునేలా సహకారం అందుతోంది. జూలై 2026 నెలలో NRTలు మరియు వారి కుటుంబ సభ్యులు ఆంధ్రప్రదేశ్లోని వివిధ దేవాలయాలలో, ముఖ్యంగా తిరుమల తిరుపతి దేవస్థానం (TTD) సహా, దర్శనాలు పొందారు. ఈ విధంగా APNRTS టెంపుల్ ట్రావెల్ సేవ ప్రవాస తెలుగు ప్రజలకు ఆధ్యాత్మిక అనుభూతిని మరింత సులభతరం చేస్తోంది.

APNRTS అందిస్తున్న టెంపుల్ ట్రావెల్ సేవల ద్వారా దర్శనం చేసుకున్న తెలుగు ప్రవాసులకు (NRTs), శ్రీ వేంకటేశ్వర స్వామివారి హుండీ నుండి తీసిన పవిత్ర నాణేలను స్వామివారి పాదాల వద్ద ఉంచి ఆశీర్వదించి అందజేయడం జరుగుతోంది. ఈ పవిత్ర నాణేలను మీ శుభకార్యాలు, ప్రత్యేక సందర్భాలు మరియు ఆధ్యాత్మిక వేడుకలను మరింత మంగళమయంగా మార్చేందుకు APNRTS ప్రత్యేకంగా అందిస్తోంది. వివాహాలు, గృహప్రవేశాలు, పుట్టినరోజులు, నామకరణాలు మరియు ఇతర శుభ సందర్భాలలో భక్తి భావంతో, దైవ ఆశీస్సులతో ఈ పవిత్ర నాణేలను బహుమతిగా అందించండి.

| Temple | Requests | Pilgrims |
|---|---|---|
| Tirupati | 181 | 655 |
| Sri Kalahasti | 2 | 10 |
| Kanipakam | 5 | 24 |
| Indrakeelaadri | 11 | 38 |
| Annavaram | 4 | 17 |
| Dwaraka Tirumala | 1 | 4 |
| Srisailam | 6 | 19 |
| Total | 210 | 767 |

విదేశాల్లో నివసిస్తున్న తెలుగు ప్రవాసులు అత్యవసర పరిస్థితుల్లో ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా లేదా సహాయం అవసరమైనా, దయచేసి క్రింది నంబర్లను సంప్రదించవలసిందిగా కోరుతున్నాము: 0863-2340678, 8500027678.

# ప్రవాసాంధ్రుల సంక్షేమం ప్రత్యేక ప్రతినిధులు

ప్రవాసాంధ్రుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం తన చర్యలను కొనసాగిస్తూనే ఉంది. వివిధ దేశాల్లో నివసిస్తున్న ఆంధ్రుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రతినిధులను నియమించింది. ఉత్తర అమెరికా నుంచి రాష్ట్రంలోకి పెట్టుబడులను ఆహ్వానించేందుకు ప్రధాన సంధాన కర్తగా మండువ సతీష్ ను నియమించింది.అలాగే మధ్య మరియు సుదూర ప్రాచ్య దేశాలకు రావి రాధాకృష్ణను , యూరోప్ కు గుంటుపల్లి జయకుమార్, మిగిలిన దేశాలకు పల్లపోటు శ్రీనివాస్ ను ప్రత్యేక ప్రతినిధులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసారు. ఈ మేరకు జీవోఆర్టీ నెం.1333 ను జులై 06 న జారీ చేసింది. ఉత్తర అమెరికా ప్రత్యేక ప్రతినిధులుగా గతంలో కోమటి జయరాంను, మిరియాల శ్రీనివాస్ ను ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే.

# ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తరపున ప్రపంచ వ్యాప్తంగా

# కో ఆర్డినేటర్లను నియమించిన APNRT





ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తరపున దేశ విదేశాల్లో ఉన్న ప్రవాసాంధ్రుల అభ్యున్నతికి, సంక్షేమానికి పాటుపడటం కోసం APNRT ప్రపంచ వ్యాప్తంగా కో ఆర్డినేటర్లను నియమించింది. వీరు APNRTతో సమన్వయము చేస్తూ తాము నివసించే ప్రాంతాలలోని తెలుగు వారి సంక్షేమానికి స్వచ్ఛందంగా సేవలు అందిస్తారు. కూటమి ప్రభుత్వంలోని అన్ని భాగస్వామ్య పక్షాలకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తూ ఆయా దేశాల్లో క్రియాశీలకంగా వ్యవహరించే వారిని ఈ పదవులకు ఎంపిక చేయడం జరిగింది. ప్రవాసాంధ్రుల సంక్షేమం కోసం ఈ విధమైన కో ఆర్డినేటర్ల వ్యవస్థను కలిగిఉన్న సంస్థ APNRT మాత్రమే. స్థానిక ప్రభుత్వాలు, భారత ఎంబసీలు, APNRT తో సమన్వయం చేసుకుంటూ తెలుగు వారి సంక్షేమానికి వీరు కృషి చేస్తారు. ప్రపంచ వ్యాప్తంగా 605 మందిని కో ఆర్డినేటర్ లుగా నియమించడం, వారికి నియామక పత్రాలను అందించడం జరిగింది. కొత్తగా నియమితులైన కో ఆర్డినేటర్ల కు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎన్నారై శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, APNRT ఛైర్మన్ వేమూరి రవి కుమార్ శుభాకాంక్షలు తెలియజేసారు.

# మేఘాలను తాకే మనోహర ప్రదేశం

# హార్స్లీ హిల్స్



కొన్ని ప్రయాణాలు గమ్యస్థానాన్ని చేరుకోవడం కోసం కాదు... మనసును మళ్లీ కనుగొనడం కోసం. అలాంటి ప్రయాణాలకు సరైన చిరునామా – హార్స్లీ హిల్స్. ఉదయాన్నే కొండలను చుట్టుముట్టిన పలుచని పొగమంచు... ఆకులపై ముత్యాల్లా మెరిసే మంచుబిందువులు... చెట్ల మధ్య నుంచి జాలువారే చల్లని గాలి... దూరంగా పక్షుల కిలకిలరావాలు... ప్రకృతి ఒడిలో ఇంత ప్రశాంతత కూడా ఉంటుందా? అని ఆశ్చర్యపోయేలా చేసే ప్రదేశం హార్స్లీ హిల్స్. అన్నమయ్య జిల్లా కొండల నడుమ, సముద్ర మట్టానికి సుమారు 1,265 మీటర్ల ఎత్తులో విరాజిల్లుతున్న ఈ అందాల నిలయం, ఆంధ్రప్రదేశ్కు ప్రకృతి ఇచ్చిన అపురూప కానుక. అందుకే దీనిని ప్రేమగా "ఆంధ్రప్రదేశ్ ఊటీ" అని పిలుస్తారు.


నగర హడావుడి నుంచి ప్రకృతి ఒడికి...: రోజూ ట్రా


ఫిక్ హారన్లతో మొదలయ్యే జీవితం... కంప్యూటర్ స్క్రీన్ల ముందు గంటల తరబడి గడిచే దినచర్య... ఒత్తిడి, పరుగులు, కాలంతో పోటీ... ఇవన్నీ ఒక క్షణంలో మరిచిపోవాలంటే హార్స్లీ హిల్స్కు వెళ్లాల్సిందే. కొండపైకి ఎక్కే వంకర తిరిగిన రహదారి మొదలైన దగ్గర నుంచే ప్రకృతి తన మాయను చూపించడం ప్రారంభిస్తుంది. ఒక్కో మలుపు తిరుగుతున్న కొద్దీ చల్లని గాలి మరింతగా పలకరిస్తుంది. ఆకాశాన్ని తాకే యూకలిప్టస్ చెట్లు ప్రయాణికులకు స్వాగతం పలుకుతాయి. గమ్యస్థానానికి చేరుకునేలోపే మనసు ప్రశాంతంగా మారిపోతుంది.

ప్రతి అడుగు ఒక అందమైన జ్ఞాపకం :హార్స్లీ హిల్స్లోని ప్రతి ప్రదేశం ఒక చిత్రకారుడు వేసిన ప్రకృతి చిత్రంలా కనిపిస్తుంది.గాలి బండ వద్ద నిలబడి లోయలను చూస్తుంటే మేఘాలు మన కళ్ల ముందే ప్రయాణిస్తున్నట్లు అనిపిస్తుంది. చల్లని గాలి ముఖాన్ని తాకుతూ, ప్రకృతి తన సంగీతాన్ని ఆలపిస్తున్నట్లుగా అనుభూతి కలుగుతుంది. సూర్యోదయం సమయంలో బంగారు కిరణాలు కొండలపై పరచుకున్న

దృశ్యం... సాయంత్రం అస్తమిస్తున్న సూర్యుడు ఆకాశాన్ని నారింజ రంగుతో అలంకరించే క్షణం... ఇవి కెమెరాలో బంధించడానికి కాదు, జీవితాంతం గుర్తుంచుకోవడానికి. మీ చేతిలో మొబైల్ ఫోన్ ఉన్నా సరే, ప్రొఫెషనల్ కెమెరా ఉన్నా సరే... హార్స్లీ హిల్స్లో తీసిన ప్రతి ఫోటో ఒక పోస్టర్లా కనిపిస్తుంది. పొగమంచు కప్పుకున్న రహదారులు... ఎత్తైన చెట్ల వరుసలు... కొండల అంచులపై నిలబడి కనిపించే లోయలు... సూర్యాస్తమయపు బంగారు వెలుగులు... ప్రతి మూల ఒక కొత్త ఫ్రేమ్ను అందిస్తుంది. అందుకే ప్రకృతి ఫోటోగ్రఫీని ఇష్టపడేవారి జాబితాలో హార్స్లీ హిల్స్కు ప్రత్యేక స్థానం ఉంది.

అడ్వెంచర్ కావాలన్నా ... ప్రశాంతత కావాలన్నా ఈ కొండల్లో రెండూ దొరుకుతాయి. ఒకవైపు ట్రెక్కింగ్, జిప్లైన్, రాపెలింగ్ వంటి అడ్వెంచర్ కార్యక్రమాలు యువతను ఉత్సాహపరుస్తుంటే... మరోవైపు చెట్ల నీడలో నిశ్శబ్దంగా కూర్చొని ప్రకృతిని ఆస్వాదించే అవకాశం మనసుకు కొత్త శక్తిని ఇస్తుంది. అందుకే కుటుంబాలు, స్నేహితులు, కొత్త జంటలు, ప్రకృతి ప్రేమికులు–ఎవరు వెళ్లినా ఈ ప్రదేశం తమదేననే అనుభూతిని కలిగిస్తుంది. అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు హార్స్లీ హిల్స్ తన అందాలను మరింతగా ఆవిష్కరిస్తుంది. అయితే వేసవిలో కూడా మైదాన ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడి వాతావరణం చల్లగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. వర్షాకాలంలో అయితే కొండలపై పరుచుకున్న ఆకుపచ్చని పరుపు, మేఘాల సందడి ఈ ప్రాంతాన్ని మరింత మంత్రముగ్ధులను చేస్తాయి. మదనపల్లె నుండి 27 కి.మీ, తిరుపతి నుండి సుమారు 130 కి.మీ, బెంగళూరు నుండి సుమారు 160 కి.మీ, హైదరాబాద్ నుండి సుమారు 530 కి.మీ దూరంలో ఈ ప్రదేశం ఉంది. రోడ్డు మార్గంలో ప్రయాణించే వారికి కొండ దారిలోని ప్రతి మలుపు ఒక కొత్త అనుభూతిని అందిస్తుంది. కొన్ని ప్రదేశాలు మన కళ్లను ఆనందింపజేస్తాయి. మరికొన్ని మన కెమెరాను ఆనందింపజేస్తాయి. కానీ హార్స్లీ హిల్స్ మాత్రం మనసును ప్రశాంతపరుస్తుంది. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ, చల్లని గాలిని ఆస్వాదిస్తూ, జీవితపు పరుగుకు కాసేపు విరామం ఇవ్వాలనుకుంటే... ఈ వీకెండ్ మీ ప్రయాణ జాబితాలో హార్స్లీ హిల్స్ పేరు తప్పకుండా ఉండాలి. ఎందుకంటే... కొన్ని ప్రదేశాలు చూడటానికి వెళ్తాం. కానీ హార్స్లీ హిల్స్ లాంటి ప్రదేశాలు అనుభవించడానికి వెళ్తాం. అక్కడి నుంచి తిరిగి వచ్చాక కూడా ఆ కొండలు, ఆ గాలి, ఆ నిశ్శబ్దం చాలా రోజుల పాటు మనతోనే ప్రయాణిస్తాయి.




ప్రవాసాంధ్రులకు
ప్రముఖ దేవాలయాల్లో
ప్రత్యేక దర్శనాల ఏర్పాటు
ఆంధ్రప్రదేశ్‌లోని ఈ 8 ప్రసిద్ధ దేవాలయాల దర్శన సేవలను
APNRTS ద్వారా ముందుగానే బుక్ చేసుకోవచ్చు
తిరుపతి
అన్నవరం
ద్వారకా తిరుమల
శ్రీశైలం
శ్రీకాళహస్తి
సింహాచలం
ఇప్పుడే APNRTSలో రిజిస్టర్ చేసుకోండి, మరిన్ని వివరాలకు సంప్రదించండి
+91 8632340678
+91 8500027678
support@apnrts.com
www.apnrts.ap.gov.in

# ప్రవాసాంధ్రులకు హెచ్చరిక

## » కువైట్లో ఎంప్లాయీ కార్డు లేకుండా ఉద్యోగం చేస్తున్నారా?



కువైట్లో ఉద్యోగం చేస్తున్న విదేశీ కార్మికులు చెల్లుబాటు అయ్యే ఎంప్లాయీ కార్డు (Employee Card/Civil ID) లేదా ఇతర అవసరమైన ఉద్యోగ పత్రాలు లేకుండా పనిచేయడం తీవ్రమైన చట్టపరమైన పరిణామాలకు దారితీయవచ్చు. చెల్లుబాటు అయ్యే ఉద్యోగ పత్రాలు లేకుండా పనిచేసే ఉద్యోగులతో పాటు, అలాంటి ఉద్యోగులను పనిలో పెట్టుకున్న స్పాన్సర్ (Employer/Kafeel) పైనా కువైట్ కార్మిక చట్టాల ప్రకారం అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కువైట్లో ఉద్యోగం చేయాలంటే స్పాన్సర్, ఉద్యోగికి వర్క్ పర్మిట్, రెసిడెన్స్ పర్మిట్ (Iqama), ఎంప్లాయీ కార్డు వంటి అవసరమైన పత్రాలను చట్టబద్ధంగా పూర్తి చేసి అందించాల్సి ఉంటుంది. ఉద్యోగి కువైట్కు వచ్చిన తర్వాత వైద్య పరీక్షలు, బయోమెట్రిక్ నమోదు, నివాస అనుమతి ప్రక్రియ పూర్తి చేసి, సంబంధిత అధికారుల ద్వారా ఎంప్లాయీ కార్డు జారీ అయ్యేలా చూడడం స్పాన్సర్ బాధ్యత.

అయితే, కొన్ని సందర్భాల్లో ఈ ప్రక్రియ పూర్తికాకముందే ఉద్యోగులను పనిలోకి దింపడం, లేదా ఉద్యోగి వేరే యజమాని వద్ద పనిచేసేలా అనుమతించడం వంటి చర్యలు చట్ట ఉల్లంఘనగా పరిగణించే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగితో పాటు సంబంధిత స్పాన్సర్ లేదా సంస్థ కూడా విచారణను ఎదుర్కోవాల్సి రావచ్చు. ఉద్యోగ తనిఖీల సమయంలో ఎంప్లాయీ కార్డు లేదా ఇతర చెల్లుబాటు అయ్యే పత్రాలు చూపించలేకపోతే ఉద్యోగిపై జరిమానా, నిర్బంధం లేదా దేశ బహిష్కరణ వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. చట్టవిరుద్ధంగా ఉద్యోగులను నియమించుకున్నట్లు తేలితే, స్పాన్సర్ లేదా సంస్థపై జరిమానాలు, లైసెన్సుకు సంబంధించిన పరిపాలనా చర్యలు లేదా ఇతర చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ప్రవాస కార్మికులు ఉద్యోగంలో చేరే ముందు తమ వర్క్ వీసా, ఇఖామా, ఎంప్లాయీ కార్డు పూర్తయ్యాయో లేదో నిర్ధారించుకోవాలి. ఉద్యోగ ఒప్పందం, జీతం, ఉద్యోగ హోదా, కంపెనీ వివరాలు అధికారిక పత్రాలకు అనుగుణంగా ఉన్నాయో లేదో కూడా పరిశీలించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఉద్యోగానికి సంబంధించిన పత్రాల జారీ ఆలస్యం అయినా, స్పాన్సర్ స్పందించకపోయినా, లేదా చట్టపరమైన ఇబ్బందులు ఎదురైనా వెంటనే భారత రాయబార కార్యాలయం, కువైట్లోని సంబంధిత కార్మిక అధికారులను లేదా ప్రవాస సంక్షేమ సంస్థలను సంప్రదించాలి. తెలుగు రాష్ట్రాలకు చెందిన వేలాది మంది కార్మికులు కువైట్లో వివిధ రంగాల్లో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో, చట్టబద్ధమైన పత్రాలతోనే ఉద్యోగం చేయడం, అలాగే స్పాన్సర్ కూడా తన చట్టబద్ధమైన బాధ్యతలను పూర్తిగా నిర్వర్తించడం ద్వారా అనవసరమైన చట్టపరమైన సమస్యలను నివారించవచ్చు.

## ఉద్యోగి మరణిస్తే కుటుంబాలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం

చట్టబద్ధమైన Employee Card లేకుండా లేదా అవసరమైన ఉద్యోగ పత్రాలు పూర్తికాకముందే పని చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే, మృతుడి కుటుంబం అనేక చట్టపరమైన మరియు పరిపాలనా సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉంది.

ఉద్యోగి చట్టబద్ధమైన ఉద్యోగ హోదాను నిర్ధారించడానికి అవసరమైన పత్రాలు లేకపోతే, మరణానికి సంబంధించిన క్లెయిమ్ల పరిశీలన ఆలస్యమయ్యే అవకాశం ఉంటుంది. ఉద్యోగి అధికారికంగా నమోదు కాలేదని తేలితే, సంబంధిత బీమా పాలసీ, ఉద్యోగ ఒప్పందం, కువైట్ కార్మిక చట్టాలు మరియు అధికారుల నిర్ణయాలను బట్టి బీమా క్లెయిమ్లు, పని ప్రమాద పరిహారం లేదా ఇతర ఉద్యోగ ప్రయోజనాల మంజూరులో జాప్యం లేదా పరిమితులు ఏర్పడే అవకాశం ఉంది. అయితే ఇవి ప్రతి కేసులో ఒకే విధంగా వర్తించవు; సంబంధిత బీమా పాలసీ, ఉద్యోగ ఒప్పందం, కువైట్ కార్మిక చట్టాలు మరియు అధికారుల నిర్ణయాలపై తుది ఫలితం ఆధారపడి ఉంటుంది. అలాగే, మరణించిన వ్యక్తి మృతదేహాన్ని స్వదేశానికి తరలించడం, అధికారిక మరణ ధృవీకరణ పత్రాలు పొందడం, బీమా క్లెయిమ్లు, వేతన బకాయిలు, ఇతర పరిహారాల కోసం అవసరమైన పత్రాల పరిశీలన కూడా క్లిష్టంగా మారే అవకాశం ఉంది.

ఈ నేపథ్యంల, కువైట్లో ఉద్యోగంలో చేరే ముందు వర్క్ వీసా, రెసిడెన్స్ పర్మిట్ (Iqama), Employee Card సహా అన్ని అధికారిక పత్రాలు పూర్తయ్యాయని నిర్ధారించుకోవాలని APNRT ప్రవాసాంధ్రులకు విజ్ఞప్తి చేస్తోంది. అలాగే, ఉద్యోగం కల్పించే స్పాన్సర్లు కూడా చట్టబద్ధమైన

నమోదు ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేసి, ఉద్యోగులకు అవసరమైన అన్ని పత్రాలు అందించాలని సూచిస్తోంది.

## APNRT సూచనలు

- కువైట్కు వెళ్లే ముందు వర్క్ వీసా, ఇఖామా, Employee Card ప్రక్రియ పూర్తయ్యిందో లేదో నిర్ధారించుకోండి.
- ఉద్యోగ ఒప్పందం ప్రతిని తప్పనిసరిగా తీసుకుని భద్రపరచుకోండి.
- పాస్పోర్ట్, Civil ID, Employee Card, Insurance వివరాల డిజిటల్ కాపీలను కూడా భద్రపరచండి.
- ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే భారత రాయబార కార్యాలయం లేదా సంబంధిత కువైట్ అధికారులను సంప్రదించండి.
- అత్యవసర పరిస్థితుల్లో APNRT హెల్ప్లైన్ను సంప్రదించండి.


info@apnrts.com
www.apnrts.ap.gov.in
/APNRTSOCIETY
/APNRTSOfficial
24/7 APNRTS హెల్ప్ లైన్
+91 863 2340678
+91 85000 27678

# భావాలకు చిరునామా దేవులపల్లి కృష్ణశాస్త్రి



## తెలుగు కవిత్వానికి లాలిత్య సుగంధాన్ని అందించిన "ఆంధ్ర షెల్లీ"

"కవిత్వం అంటే కేవలం పదాల సమాహారం కాదు... మనసు పలికే మౌన సంగీతం." ఈ మాటలకు సజీవ రూపం దేవులపల్లి కృష్ణశాస్త్రి. తెలుగు భావకవిత్వానికి అపూర్వమైన సౌందర్యాన్ని, మాధుర్యాన్ని అందించిన మహాకవుల్లో ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రకృతిని ప్రేమగా, ప్రేమను పవిత్రంగా, జీవితాన్ని సంగీతంలా చూసిన అరుదైన కవి ఆయన. ఆంగ్ల కవి పర్సీ బిష్ షెల్లీ రచనల ప్రభావంతో భావోద్వేగాలకు, ప్రకృతి సౌందర్యానికి కొత్త రూపాన్ని తెలుగు కవిత్వంలో ఆవిష్కరించారు. అందుకే ఆయనను ప్రేమతో "ఆంధ్ర షెల్లీ" అని పిలుస్తారు.

భావకవిత్వానికి నూతన దిశ : తెలుగు కవిత్వంలో చాలాకాలం వరకు పౌరాణిక ఇతివృత్తాలు, రాజుల ప్రశంసలు ప్రధానంగా ఉండేవి. అయితే కృష్ణశాస్త్రి మనిషి హృదయంలోని సున్నితమైన భావాలకు, ప్రేమకు, ప్రకృతికి, విరహానికి తన కవిత్వంలో ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన పద్యాలు చదివితే ప్రకృతిలో విహరిస్తున్న అనుభూతి కలుగుతుంది. ప్రతి పదం సంగీతంలా, ప్రతి భావం మనసును తాకేలా ఉంటుంది. ఆయన కవిత్వంలో ప్రేమ కేవలం ఇద్దరి మధ్య అనుబంధం మాత్రమే కాదు; అది జీవితం పట్ల ఉన్న ఆరాధన. ప్రకృతి కేవలం చెట్లు, పూలు, పక్షులు మాత్రమే కాదు; అది మానవ హృదయానికి అద్దం.

తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిన కృష్ణపక్షం, ఊర్వశి, ప్రవాసం, పల్లకి, అమృతవీణ, మంగళకాహళి ఈ రచనలన్నీ భావోద్వేగాల లోతును, భాషా లాలిత్యాన్ని ప్రతిబింబిస్తాయి.

### కృష్ణశాస్త్రి కవిత్వంలోని అత్యంత ప్రసిద్ధ పంక్తుల్లో ఒకటి:

***"ఆకులో ఆకునై... పూవులో పూవునై... కొమ్మలో కొమ్మనై... ఈ అడవి దాగిపోనా?"***

**భావార్థం :** ఈ పంక్తుల్లో కవి ప్రకృతితో తన ఆత్మను ఏకం చేసుకోవాలనే తపనను వ్యక్తం చేస్తున్నారు. ఆకులో ఆకుగా, పువ్వులో పువ్వుగా, చెట్టు కొమ్మలో ఒక భాగంగా మారి ప్రకృతిలో లీనమవాలని ఆయన కోరుకుంటున్నారు. మనిషి ప్రకృతికి వేరుకాదని, ప్రకృతితో మమేకమైనప్పుడే నిజమైన ఆనందం లభిస్తుందని ఈ కవిత తెలియజేస్తుంది. భావకవిత్వ సౌందర్యానికి ఈ పంక్తులు అద్భుత నిదర్శనం.

### వెండితెరపై సాహిత్య సుగంధం :

కృష్ణశాస్త్రి కేవలం భావకవి మాత్రమే కాదు, తెలుగు సినీ గేయాలకు సాహిత్య గౌరవాన్ని తీసుకొచ్చిన ప్రముఖ గేయరచయిత కూడా. ఆయన రాసిన పాటల్లో సాహిత్య విలువలు, సంగీత మాధుర్యం సమపాళ్లలో కనిపిస్తాయి. ఆయన రచించిన చిరస్మరణీయ గీతాల్లో ఒకటి:

***"మనసున మల్లెల మాలలూగెనే..."*** ఈ గీతం ప్రేమలోని స్వచ్ఛతను, హృదయంలో వికసించే మధురమైన అనుభూతిని సున్నితంగా ఆవిష్కరిస్తుంది. పదాల్లోని లాలిత్యం, భావాల్లోని మాధుర్యం ఈ పాటను తెలుగు సినీ సంగీతంలో చిరస్థాయిగా నిలబెట్టాయి.

### గొంతు మూగబోయినా... కలం మూగ కాలేదు:

జీవితాంతంలో గొంతు సంబంధిత అనారోగ్యం కారణంగా ఆయన తన స్వరాన్ని కోల్పోయారు. అయితే అది ఆయన సృజనను ఆపలేకపోయింది. మాట్లాడలేని పరిస్థితిలో కూడా తన ఆలోచనలను, భావాలను రచనల ద్వారా వ్యక్తపరుస్తూ సాహిత్య సేవను కొనసాగించారు. నిజమైన కవికి స్వరం కంటే భావమే గొప్పదని ఆయన జీవితం నిరూపించింది.

### పురస్కారాలు — గౌరవాలు :

సాహిత్యానికి ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా అనేక గౌరవాలు లభించాయి. పద్మభూషణ్, సాహిత్య అకాడమీ పురస్కారం,ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదు ఇవి ఆయన సాహిత్య మహోన్నతికి నిదర్శనాలు.

"భావాన్ని సంగీతంగా, పదాన్ని పరిమళంగా మార్చిన మహాకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి. తెలుగు భాష ఉన్నంతకాలం ఆయన కవిత్వం పాఠకుల హృదయాల్లో చిరంజీవిగానే నిలిచి ఉంటుంది."




info@apnrts.com
www.apnrts.ap.gov.in
/APNRTSOCIETY
/APNRTSOfficial
24/7 APNRTS హెల్ప్ లైన్
+91 863 2340678
+91 85000 27678


శుభ కార్యాలకు
॥ శ్రీవారి పవిత్ర నాణేలు ॥
APNRTS శ్రీ వారి హుండీ నుంచి వచ్చిన పవిత్ర నాణేలను ప్రవాసాంధ్రులకు అందిస్తోంది.
ఈరోజే పవిత్ర నాణేలను కొనుగోలు చేసి మీ శుభ సందర్భాల్లో ఉపయోగించండి.
శిశు జననం । విద్య । వివాహాలు । నూతన వ్యాపారం । గృహప్రవేశం
కిట్లు
రూ. 1000
రూ. 2000
పవిత్ర నాణేలను తిరుమల లేదా APNRTS ఆఫీస్ (తాడేపల్లి)లో పొందవచ్చు
24/7 హెల్ప్ లైన్
ఇప్పుడే APNRTSలో నమోదు చేసుకోండి. మరిన్ని వివరాలకు సంప్రదించండి
+91 8632340678
+91 8500027678
support@apnrts.com
www.apnrts.ap.gov.in

# గురు పౌర్ణమి విశిష్టత




భగవంతుడు సర్వవ్యాపి అయినప్పటికీ గురువు శిష్యుని అజ్ఞానాన్ని తొలగించి, సత్యాన్ని, పరమాత్మను తెలుసుకునే మార్గాన్ని చూపిస్తాడు. అందుకే కబీర్దాస్ గురువుకు అత్యున్నత స్థానం ఇవ్వాలన్నారు. భారతీయ సంప్రదాయంలో గురువు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల స్వరూపమే. ఆయన సాక్షాత్ పరబ్రహ్మ అని గౌరవిస్తారు. 2026 సంవత్సరానికి గాను గురు పూర్ణిమ (గురు పౌర్ణమి) జూలై 29, బుధవారం జరుపుకున్నారు. మహాభారతాన్ని, వేదాలను విభజించి, మానవాళికి అందించిన మహర్షి వేద వ్యాసుని జయంతిని ఈ రోజే జరుపుకున్నారు.ఈ సందర్భంగా గురువు ను స్మరిస్తూ ఆయన గొప్పదనాన్ని తెలుసుకుందాం. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే, గురువు జీవితానికి అర్థం చెబుతాడు. జ్ఞానాన్ని మాత్రమే కాదు, సద్గుణాలు, సంస్కారం, ధర్మం, ఆత్మవిశ్వాసం, జీవిత లక్ష్యాన్ని ప్రసాదించేవాడు గురువు. ఆధ్యాత్మిక మార్గంలో గురువు మనలోని దివ్యత్వాన్ని గుర్తించడానికి దారి చూపుతాడు. మనస్సును నిర్మలపరచి, ఆత్మజ్ఞానం వైపు నడిపిస్తాడు. నిజమైన గురువు తన వైపు కాకుండా సత్యం వైపు శిష్యుడిని నడిపిస్తాడు. మన దేశంలో వశిష్ఠుడు, విశ్వామిత్రుడు, ద్రోణాచార్యుడు, సాందీపని మహర్షి వంటి మహనీయులు గురువులుగా ప్రసిద్ధి చెందారు. వారి శిష్యులు జ్ఞానం, ధైర్యం, ధర్మం, కర్తవ్యనిష్ఠతో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారు. "గు" అంటే అంధకారం (అజ్ఞానం), "రు" అంటే దానిని తొలగించేవాడు. కాబట్టి, అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించేవాడే గురువు. హిందూ ధర్మంలో గురువుగా,



యోగిగా, అవధూత సంప్రదాయానికి ఆదిగురువుగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులైన త్రిమూర్తుల సమ్మిళిత అవతారంగా, మూడు తలలు కలిగిన శ్రీ గురు దత్తాత్రేయ స్వామిని మనం పూజిస్తాం. మహర్షి అత్రి మరియు అనసూయాదేవికి త్రిమూర్తులు వరంగా ప్రసాదించిన కుమారుడు ఆయన. అనసూయాదేవి పతివ్రత్యాన్ని పరీక్షించడానికి త్రిమూర్తులు వచ్చినప్పుడు, ఆమె తపోబలంతో వారిని శిశువులుగా మార్చింది. అనంతరం వారు సంతోషించి తమ అంశాలతో దత్తాత్రేయునిగా అవతరించారని పురాణాలు చెబుతున్నాయి. దత్తాత్రేయుడు రాజభోగాలు, బంధాలు, ఆస్తులపై ఆసక్తి లేకుండా స్వేచ్ఛగా సంచరించిన అవధూత యోగిగా ప్రసిద్ధి చెందారు. దత్తాత్రేయుడు ప్రకృతిలోని 24 గురువుల నుంచి జీవిత పాఠాలు నేర్చుకున్నారని అవధూత గీత మరియు శ్రీమద్భాగవతంలో చెప్పబడింది. వాటిలో కొన్ని భూమి నుండి సహనం ,గాలి నుండి అనాసక్తి ,నీరు నుండి పవిత్రత,అగ్ని నుండి పరిశుద్ధత, ఆకాశం నుండి విశాలత, సూర్యుడి నుండి సేవాభావం, చంద్రుడి నుండి సమత్వం, తేనెటీగ నుండి శ్రమ, సాలీడు నుండి సృష్టి రహస్యం ఇలా నేర్చుకున్నారని చెప్తారు. దత్తాత్రేయుని వెంట ఉండే నాలుగు కుక్కలు నాలుగు వేదాలకు (ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం) ప్రతీకగా భావిస్తారు. ఆయన చేతుల్లో ఉండే శంఖం దివ్యనాదం, సృష్టి ప్రారంభానికి ప్రతీక కాగా, చక్రం ధర్మరక్షణ, కాలచక్రానికి ప్రతీక. త్రిశూలం త్రిగుణాలు (సత్త్వ, రజస్, తమస్)పై ఆధిపత్యానికి ప్రతీక. డమరుకం సృష్టి నాదం, శివతత్వానికి ప్రతీక. కమండలం వైరాగ్యం, తపస్సు, సన్యాసానికి ప్రతీక. జపమాల ధ్యానం, జ్ఞానం, నిరంతర నామస్మరణకు ప్రతీక. ఇవి త్రిమూర్తుల శక్తులను, జ్ఞానాన్ని, యోగాన్ని సూచిస్తాయి. భారతదేశంలో దత్తాత్రేయ సంప్రదాయానికి ప్రసిద్ధమైన కొన్ని క్షేత్రాలు ఉన్నాయి. అవి గణగాపుర దత్తక్షేత్రం, నరసింహవాడి, పీఠాపురం శ్రీపాద శ్రీవల్లభ జన్మస్థలం,కురవపురం,అక్కల్కోట.

"ప్రపంచంలోని ప్రతి జీవి, ప్రతి సంఘటన, ప్రతి ప్రకృతి అంశం మనకు గురువే. వినయంతో గమనిస్తే ప్రతి క్షణం ఒక పాఠమే." ఈ భావన వల్లే ఆయనను "జగద్గురు" మరియు "ఆదిగురు" అని భక్తులు గౌరవిస్తారు.




# యూఏపీఏ (UAPA) చట్టం – భారతదేశ ఉగ్రవాద నిరోధక చట్టం: లక్ష్యాలు, ముఖ్య నిబంధనలు, వివాదాలు

యూఏపీఏ భారతదేశంలోని అత్యంత కీలకమైన ఉగ్రవాద నిరోధక చట్టాలలో ఒకటి. దేశ భద్రతను కాపాడడంలో ఇది ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఈ చట్టం అమలులో పారదర్శకత, న్యాయపరమైన పర్యవేక్షణ, చట్టబద్ధ ప్రక్రియలకు కట్టుబడి ఉండడం ప్రజాస్వామ్య వ్యవస్థకు అవసరం. భారతదేశ సమగ్రత, సార్వభౌమత్వం మరియు జాతీయ భద్రతకు ముప్పుగా భావించే చట్టవిరుద్ధ, ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టేందుకు భారత పార్లమెంట్ ఈ చట్టాన్ని 1967లో ఆమోదించింది. కాలక్రమేణా 2004, 2008, 2012, 2019 సంవత్సరాల్లో ఈ చట్టానికి పలు కీలక సవరణలు చేయబడ్డాయి. యూఏపీఏ (Unlawful Activities (Prevention) Act – UAPA) అంటే చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం, 1967.

దేశ సార్వభౌమత్వం, సమగ్రతను రక్షించడం, ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టడం, చట్టవిరుద్ధ సంస్థలను నిషేధించడం, ఉగ్రవాదానికి సంబంధించిన నిధులు, ఆస్తులను నియంత్రించడం, ఉగ్రవాదానికి సహకరించే వ్యక్తులు, సంస్థలపై చట్టపరమైన చర్యలు


info@apnrts.com /APNRTSOCIETY
www.apnrts.ap.gov.in /APNRTSOfficial
24/7 APNRTS హెల్ప్‌లైన్
+91 863 2340678
+91 85000 27678

తీసుకోవడం వంటి ప్రధాన లక్ష్యాలతో ఈ చట్టం రూపొందించబడింది: ఈ చట్టం ద్వారా చట్టవిరుద్ధ సంస్థలపై నిషేధం విధించవచ్చు.

కేంద్ర ప్రభుత్వం దేశ భద్రతకు ముప్పుగా భావించిన సంస్థలను చట్టవిరుద్ధ సంస్థలుగా ప్రకటించవచ్చు. 2019 సవరణ తర్వాత సంస్థలతో పాటు వ్యక్తులను కూడా "ఉగ్రవాది"గా ప్రకటించే అధికారాన్ని ఈ చట్టం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి కల్పించారు. ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించినట్లు భావించిన ఆస్తులను చట్టప్రకారం స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుంది. సాధారణంగా యూఏపీఏ కింద నమోదైన కేసులను National Investigation Agency (NIA) లేదా ఇతర అధికృత దర్యాప్తు సంస్థలు విచారిస్తాయి. ఈ చట్టం కింద అరెస్టైన వారికి బెయిల్ పొందడం సాధారణ క్రిమినల్ కేసులతో పోలిస్తే కష్టతరంగా ఉంటుంది.

## యూఏపీఏ చట్టానికి సంబంధించి ప్రధాన సవరణలు

» **2004 — ఉగ్రవాద నేరాలకు సంబంధించిన నిబంధనలు విస్తరించబడ్డాయి.**

» **2008 — ముంబై 26/11 దాడుల అనంతరం దర్యాప్తు అధికారాలు, శిక్షలను మరింత కఠినతరం చేశారు.**

» **2012 — ఉగ్రవాదానికి నిధుల సమీకరణ వంటి అంశాలపై అదనపు నిబంధనలు చేర్చారు.**

» **2019 — వ్యక్తులను కూడా ఉగ్రవాదులుగా ప్రకటించే అవకాశం కల్పించారు.**

ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొనడమే కాదు వాటికి సహకరించే వారిపై కూడా ఈ చట్టాన్ని ప్రయాగించేt అవకాశం ఉంది. ఉగ్రవాద సంస్థలకు ప్రచారం కల్పించడం, ఆర్థిక వనరులు సమకూర్చడం, వాటి కార్యకలాపాల్లో ప్రత్యక్షముగా లేదా పరోక్షంగా పాల్గొనడం వంటి కారణాలతో ప్రభుత్వం ఈ చట్టం ప్రయోగించవచ్చు.

ఈ చట్టం దేశ భద్రతను బలోపేతం చేస్తుంది. ఉగ్రవాద సంస్థల కార్యకలాపాలను నియంత్రించడంలో సహాయపడుతుంది. అంతర్జాతీయ ఉగ్రవాద నెట్వర్క్లపై చర్యలు తీసుకోవడానికి చట్టబద్ధమైన ఆధారం అందిస్తుంది. ఉగ్రవాదానికి సంబంధించిన ఆర్థిక వనరులను అడ్డుకునే అవకాశం కల్పిస్తుంది.

ఒక వ్యక్తి ఉగ్రవాద చర్యలకు పాల్పడినట్లు కోర్టులో నిరూపితమైతే, ఆ చర్య వల్ల ఎవరి మరణమైనా సంభవిస్తే మరణదండన లేదా యావజ్జీవ కారాగార శిక్ష, అలాగే జరిమానా విధించవచ్చు. మరణం సంభవించని సందర్భాల్లో కనీసం ఐదు సంవత్సరాల నుండి యావజ్జీవ కారాగార శిక్ష వరకు, అలాగే జరిమానా విధించవచ్చు. ప్రభుత్వం నిషేధించిన ఉగ్రవాద సంస్థలో సభ్యుడిగా ఉండటం లేదా ఆ సంస్థ కార్యకలాపాలలో పాల్గొనడం నేరం. దీనికి సాధారణంగా యావజ్జీవ కారాగార శిక్ష లేదా పదేళ్ల వరకు జైలు శిక్ష, అలాగే జరిమానా విధించే అవకాశం ఉంటుంది. ఉగ్రవాద కార్యకలాపాల కోసం నిధులు సమకూర్చడం, సేకరించడం లేదా ఆర్థిక సహాయం అందించడం తీవ్రమైన నేరం. దీనికి యావజ్జీవ కారాగార శిక్ష వరకు లేదా పదేళ్లకు తగ్గకుండా కాకుండా చట్టంలోని సంబంధిత నిబంధనల ప్రకారం శిక్ష, అలాగే జరిమానా విధించవచ్చు. ఉగ్రవాదులకు నివాసం, ఆశ్రయం లేదా ఇతర సహాయం అందించిన వ్యక్తులకు జైలు శిక్ష మరియు జరిమానా విధించే అవకాశం ఉంది. శిక్ష నేరం యొక్క తీవ్రతపై ఆధారపడి ఉంటుంది. ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన ఆస్తులను దాచిపెట్టడం, వినియోగించడం లేదా నిర్వహించడం కూడా నేరమే. దీనికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించబడుతుంది. అదనంగా, సంబంధిత ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు. ఉగ్రవాద చర్యలకు కుట్ర పన్నడం, ప్రోత్సహించడం, సహకరించడం లేదా ఇతరులను ప్రేరేపించడం వంటి చర్యలకు కూడా ప్రధాన నేరాలకు సమానంగా కఠినమైన శిక్షలు విధించే అవకాశం ఉంటుంది.

NRT
AP Non Resident Telugu Society

# AP NRIs

## మీ స్థానిక సమాచారాన్ని, అనుభవాలను ప్రపంచ తెలుగు వారితో పంచుకోండి

- తెలుగు సంఘాల కార్యక్రమాలు
- ఉద్యోగ అవకాశాలు
- మీరు నివసిస్తున్న దేశంలోని విశిష్టతలు
- సామాజిక & సాంస్కృతిక విశేషాలు
- పర్యాటక ఆకర్షణలు



**మీ వివరాలను APNRTSకి MAIL ద్వారా పంపండి**

మీ సమాచారాన్ని ప్రపంచ తెలుగు వారికి చేరవేసేలా **APNRTS E-MAGAZINEలో** మీ పేరు, ఫోటోతో ప్రచురించబడతాయి.

+91 08632340678 | +91 8500027678 | apnrtsnews@gmail.com | www.apnrts.ap.gov.in



# దాన గుణం - గొప్ప వరం

## గొప్పల కోసం కాకుండా బాధ్యతతో దానం చేయండి

భారతీయ సంస్కృతిలో దానం అనేది అత్యున్నత ధర్మాలలో ఒకటిగా భావించబడింది. "దానం" అంటే కేవలం ధనం ఇవ్వడం మాత్రమే కాదు, అవసరంలో ఉన్నవారికి అన్నం, విద్య, జ్ఞానం, సమయం, సేవ, ధైర్యం, ప్రేమ వంటి విలువైన వాటిని నిస్వార్థంగా అందించడం కూడా దానమే. దాన గుణం మనిషిలో కరుణ, దయ, పరస్పర సహకారం, సమాజం పట్ల బాధ్యతను పెంపొందిస్తుంది. మన భారతీయ సంస్కృతికి మూలాధారం ధర్మం. ఆ ధర్మంలో దానం ఒక భాగం. "త్యాగేనైకేన అమృతత్వమానశుః" త్యాగం ద్వారానే శాశ్వతమైన గొప్పతనం లభిస్తుంది. దానం అనేది ఆ త్యాగానికి ఆచరణ రూపం.

చాలామంది దానం అంటే డబ్బు ఇవ్వడమే అనుకుంటారు. కానీ మన శాస్త్రాలు దానానికి మరింత విశాలమైన అర్థాన్ని చెప్పాయి. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం అన్నదానం. విద్య లేనివారికి విద్య అందించడం విద్యాదానం. భయపడుతున్నవారికి ధైర్యం చెప్పడం అభయదానం. రోగులకు రక్తం ఇవ్వడం రక్తదానం. అవయవాలను దానం చేసి మరొకరికి జీవితం ఇవ్వడం అవయవదానం. మన సమయం, మన

జ్ఞానం, మన ప్రేమ, మన సేవ ఇవన్నీ పంచడం ద్వారా కూడా దానం చేయవచ్చు. మన పురాణాలు, ఇతిహాసాలు దానశీలురైన మహనీయుల కథలతో నిండి ఉన్నాయి. కర్ణుడు, శిబి చక్రవర్తి, మహాబలి వంటి వారి జీవిత కథలు త్యాగానికి, దానానికి ప్రతీకలు. దానం అనేది సంపదకు సంబంధించినది కాదు, అది హృదయానికి సంబంధించినదని ప్రతి ఒక్కరు గ్రహించాలి. దానం చేయటానికి ధనవంతులు కానక్కర లేదు. మంచి మనసు ఉంటే చాలు. ఒక మంచి మాట కూడా దానమే అవుతుంది. ఒక చిరునవ్వు కూడా దానమే. నిరాశలో ఉన్న వ్యక్తికి ధైర్యం చెప్పడం కూడా దానమే.

భగవద్గీతలో శ్రీ కృష్ణుడు దానాన్ని మూడు రకాలుగా వివరించాడు. సాత్వికము, రాజసికము,తామసికము అనే మూడు విధాలుగా దానాన్ని నిర్వచించాడు.

*"దాతవ్యమితి యద్దానం దీయతేనుపకారిణే । దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతమ్ ॥"*

*దేశాన్ని, కాలాన్ని, పాత్రతను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి ఫలాపేక్ష లేకుండా చేసే దానం సాత్వికమైన దానంగా పేర్కొనబడింది.*

*"యత్తు ప్రత్యుపకారార్థం ఫలముద్దిశ్య వా పునః । దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్ ॥*

*ప్రతిఫలం వస్తుందని ఆశించి, పేరు వస్తుందని భావించి లేదా ఎదుటివారి నుండి ప్రయోజనం పొందాలనే ఉద్దేశంతో చేసే దానం రాజసిక దానం.*

*"అదేశకాలే యద్దానం అపాత్రేభ్యశ్చ దీయతే । అసత్కృతమవజ్ఞాతం తత్తామసముదాహృతమ్ ॥"*

తగని సమయంలో, అర్హత లేని వారికి, అవమానిస్తూ లేదా నిర్లక్ష్యంగా చేసే దానం తామసిక దానం.

దానం చేసే వస్తువు ఎంత విలువైనదో అనే దాని కంటే, దానిని ఇచ్చే హృదయం పవిత్రంగా ఉండాలని భగవద్గీత చెబుతోంది. ఒకడు పది వేలు ఇస్తే నేను ఇరవై వేలు ఇస్తానంటూ గొప్పల కోసం చేసే దానం రాజసికమైనది, మూడో వ్యక్తి ముప్పై వేలు దానం చేస్తే దీని వలన ఆశించిన కీర్తి లభించక భంగ పడాల్సి వస్తుంది. అవసరం లేని వారికి, అపాత్ర వ్యక్తికి చేసే దానం తామసమైనది. మనకు అవసరం లేని వస్తువులు ఇతరులకు ఇచ్చేసి దానంగా భావించకూడదు. అలాగే మనం చేసే దానం వ్యక్తి పతనానికి కారణం కాకూడదు. మనం చేసిన దానం వలన ఒక వ్యక్తి మద్యం సేవించి సమాజానికి కీడు తలపెట్టే పనిచేస్తే దాని దుష్ఫలితం మనకు చుట్టుకుంటుంది. అందుకే అపాత్ర వ్యక్తికి దానం చేయకూడదు అని శాస్త్రం చెబుతుంది. అవతల వ్యక్తి మనకు తెలిసిన వాడా, మన కులానికి చెందిన వాడా, మన దేశానికి చెందిన వాడా, తరువాత మనకేమన్నా ఉపయోగ పడతాడా ఇటువంటి ఆలోచనలతో దానం చేయకూడదు.

దానం గురించి అత్యంత ప్రసిద్ధమైన తైత్తిరీయ ఉపనిషత్తు ఈ విధంగా తెలియజేస్తుంది.

*శ్రద్ధయా దేయమ్। అశ్రద్ధయా అదేయమ్। శ్రియా దేయమ్। హ్రియా దేయమ్। భియా దేయమ్। సంవిదా దేయమ్।*

- శ్రద్ధతో దానం చేయాలి.
- అశ్రద్ధతో దానం చేయకూడదు.
- తన శక్తికి తగిన విధంగా దానం చేయాలి.
- వినయంతో దానం చేయాలి.
- బాధ్యతతో దానం చేయాలి.
- వివేకంతో, అవగాహనతో దానం చేయాలి.


నిజానికి నువ్వు చేసే దానంవలనే ఆ వ్యక్తి బ్రతికి బట్ట కడతాడనే అహంకారం పనికి రాదు. సమాజంలో ఏదో విధంగా ఎవరికి కావలసిన సహాయం వారికి అందుతూ ఉంటుంది. ఈ అవకాశం మనకి లభించిందనే బాధ్యతతో దానం చేయాలి. ఇంతకన్నా ఎక్కువ ఇవ్వలేక పోతున్నాననే సిగ్గుతో దానం చేయమన్నారు. ఒక చేతితో చేసే దానం ఇంకొక చేతికి తెలియాల్సిన అవసరం లేదు. ప్రస్తుత ఆధునిక యుగంలో చాలా మంది రోడ్ల వెంట నివసించే వారికి ఒక దుప్పటో, అరటి పండ్లో దానం చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి గొప్పలు ప్రకటించుకోవడం చూస్తున్నాం. ఇది ఒక అహంకార ధోరణి. అవతలి వారిని తక్కువ చేసి మనం గొప్పగా ప్రకటించుకోవడం మూర్ఖత్వం.

దానం చేయడం ద్వారా సమాజం అభివృద్ధి చెందడమే కాకుండా, దాత హృదయం కూడా విశాలమై ఉన్నత స్థితిని చేరుకోవడానికి తోడ్పడుతుంది.అందుకే దానం చేయండి. అత్యంత శ్రద్ధతో అన్ని అంశాలు తెలుసుకొని దానం చేయండి.


info@apnrts.com
www.apnrts.ap.gov.in
/APNRTSOCIETY
/APNRTSOfficial
24/7 APNRTS హెల్ప్ లైన్
+91 863 2340678
+91 85000 27678

# ఎన్ఆర్ఐ ఫిర్యాదుపై తక్షణ విచారణ

అమెరికాలో నివసిస్తున్న ఎన్ఆర్ఐ శ్రీమతి భువనేశ్వరి కొండూరు ఆస్తి వివాదానికి సంబంధించి తమకు ఎదురైన సమస్యను ఏపీ ఎన్ఆర్టీ సొసైటీ (APNRT Society) దృష్టికి తీసుకువచ్చారు. ఫిర్యాదును స్వీకరించిన ఏపీ ఎన్ఆర్టీ సొసైటీ సంబంధిత పోలీసు అధికారులతో సమన్వయం చేసి, ఫిర్యాదుపై తక్షణ విచారణ చేపట్టేలా చర్యలు తీసుకుంది. దీని ఫలితంగా సంబంధిత పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు నిర్వహించారు. దర్యాప్తు అనంతరం నిందితురాలిపై చట్టపరమైన చర్యలు ప్రారంభించి, ఛార్జ్ షీట్ దాఖలు చేసే ప్రక్రియను చేపట్టారు. అలాగే ఫిర్యాదుదారురాలు మరియు వారి ఆస్తికి భద్రత కల్పించేందుకు పోలీసు రక్షణ కూడా ఏర్పాటు చేశారు. ఏపీ ఎన్ఆర్టీ సొసైటీ జోక్యంతో సంబంధిత శాఖలతో సమర్థవంతమైన సమన్వయం కారణంగా పిటిషనర్కు న్యాయం జరిగే దిశగా చట్టపరమైన చర్యలు వేగవంతమై, సమస్య పరిష్కార దిశగా కీలక పురోగతి సాధించబడింది.






# దూర దేశం వియత్నాంలో విషాదం

» తెలుగు కుటుంబాలకు తోడుగా ప్రభుత్వం

» అత్యంత విషాద సమయంలో భరోసా నింపిన APNRT సమన్వయ చర్యలు

విహారయాత్ర కోసం వియత్నాం వెళ్లిన తెలుగు పర్యాటకుల జీవితాల్లో విషాదం చోటుచేసుకుంది. వియత్నాంలోని ఫు క్వాక్ దీవి (Phu Quoc Island) సమీపంలో జరిగిన బోటు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు పర్యాటకులు మృతి చెందారు. ఈ ఘటనతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మృతి చెందిన వారిలో ముడియం శ్రీధర్ (45) – కడప జిల్లా, గెల్లి జయశ్రీ (35) – మచిలీపట్నం, కృష్ణా జిల్లా, నల్లపేట రవితేజ (41) – హిందూపురం ప్రాంతం ఉన్నారు. వీరు సాధారణ విహారయాత్రలో భాగంగా వియత్నాం వెళ్లారు. అక్కడ పర్యాటక ప్రదేశాల సందర్శనలో భాగంగా సముద్ర ప్రయాణం (బోట్ ట్రిప్) చేస్తుండగా ప్రమాదం జరిగింది. ఘటన సమాచారం అందిన వెంటనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (MEA), భారత రాయబార కార్యాలయం, APNRT, ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ అధికారులు, వియత్నాం అధికారులతో సమన్వయం చేస్తూ మృతదేహాలను త్వరగా స్వదేశానికి తీసుకురావడానికి చర్యలు చేపట్టింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు విదేశీ వ్యవహారాల


info@apnrts.com
www.apnrts.ap.gov.in
/APNRTSOCIETY
/APNRTSOfficial
24/7 APNRTS హెల్ప్ లైన్
+91 863 2340678
+91 85000 27678




మంత్రిత్వ శాఖ, వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ భవన్ అధికారులతో సమన్వయం చేస్తూ భౌతికకాయాల తరలింపునకు చర్యలు తీసుకున్నారు. వియత్నాంలో అవసరమైన చట్టపరమైన ప్రక్రియలు, గుర్తింపు ప్రక్రియలు పూర్తి చేసిన అనంతరం భౌతికకాయాలను స్వదేశానికి తరలించారు. వియత్నాం నుంచి మృతదేహాలు మొదట హో చి మిన్ సిటీ (Ho Chi Minh City)కు చేరుకుని, అక్కడి నుంచి విమాన మార్గంలో భారత్కు తరలించబడ్డాయి. మృతదేహాలు ముంబై అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న అనంతరం, అవసరమైన కస్టమ్స్ మరియు ఇతర అధికారిక ప్రక్రియలు పూర్తి చేసి, హైదరాబాద్లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి తీసుకువచ్చారు. అక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో APNRT ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేసింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హైదరాబాద్ విమానాశ్రయంలో ఏర్పాట్లను పర్యవేక్షించి, మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయం అందించే చర్యలు చేపట్టారు. అలాగే మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నంలో మృతురాలు గెల్లి జయశ్రీ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రభుత్వ సహాయాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు. అన్ని స్థాయిల్లో సమన్వయం కోసం ప్రభుత్వం ప్రత్యేక అధికారులను యుద్ధప్రాతిపదికన నియమించింది. దానికోసం ఆయా జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలను జారీ చేసింది. వీరందరితో APNRT ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ సమాచారాన్ని అందించింది. తన బాధ్యతలో భాగంగా APNRT పలు స్థాయిల్లో సమన్వయ చర్యలు చేపట్టింది. వియత్నాంలోని భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరిపింది. మృతుల భౌతికకాయాల గుర్తింపు, అవసరమైన పత్రాల ప్రక్రియ, రవాణా ఏర్పాట్లపై నిరంతరం సమాచారం సేకరించింది. హైదరాబాద్ విమానాశ్రయ అధికారులతో సమన్వయం చేసి భౌతికకాయాలు చేరుకున్న తర్వాత అవసరమైన ఏర్పాట్లు చేసింది. మృతుల కుటుంబ సభ్యులతో APNRT ప్రతినిధులు సంప్రదింపులు కొనసాగిస్తూ, అవసరమైన సమాచారం అందించారు. భౌతికకాయాలు వారి ఇళ్లకు చేరుకునే వరకు ప్రతి దశను పర్యవేక్షిస్తూ కుటుంబాలకు మానసిక ధైర్యాన్ని అందించారు.






## అత్యంత క్లిష్ట సమయంలో APNRT తక్షణ స్పందన

విదేశాల్లో ఉన్న తెలుగు ప్రజలకు అవసరమైనప్పుడు సహాయం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ నాన్‌రెసిడెంట్ తెలుగు సొసైటీ (APNRT) ఈ ఘటనలో అత్యంత వేగంగా స్పందించింది.

ప్రమాద సమాచారం అందిన క్షణం నుంచే APNRT తన 24 X 7 హెల్ప్ లైన్ ద్వారా ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది.

- వియత్నాంలోని భారత రాయబార కార్యాలయంతో నిరంతర సంప్రదింపులు కొనసాగించింది.
- మృతుల గుర్తింపు, అవసరమైన పత్రాలు, అనుమతులు, రవాణా ఏర్పాట్లపై ప్రతి దశను పర్యవేక్షించింది.
- ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ అధికారులతో కలిసి అన్ని ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం చేసింది.
- హైదరాబాద్ విమానాశ్రయంలో భౌతికకాయాల స్వీకరణ, అంబులెన్స్ ఏర్పాట్లు, స్వగ్రామాలకు తరలింపు వంటి అన్ని అంశాలను సమర్థవంతంగా నిర్వహించింది.
- మృతుల కుటుంబ సభ్యులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తూ, ప్రతి దశలో వారికి సమాచారం అందించింది.
- కుటుంబ సభ్యులకు అవసరమైన మానసిక ధైర్యం, పరిపాలనా సహకారం అందిస్తూ భౌతికకాయాలు వారి నివాసాలకు చేరుకునే వరకు పర్యవేక్షించింది.

## సంక్షోభ సమయంలో ప్రభుత్వ సేవలకు నిదర్శనం

విదేశాల్లో జరిగే అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ శాఖలు, భారత రాయబార కార్యాలయాలు, APNRT మధ్య సమర్థవంతమైన సమన్వయం ఎంత కీలకమో ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది.

స్వదేశానికి వేల కిలోమీటర్ల దూరంలో జరిగిన ఈ విషాద సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత రాయబార కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ భవన్, APNRT అధికారులు కలిసి పనిచేసి అత్యంత క్లిష్టమైన ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు.

ప్రాణాలు కోల్పోయిన తెలుగు పర్యాటకులను గౌరవప్రదంగా వారి స్వస్థలాలకు చేర్చడంతో పాటు, దుఃఖంలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం ద్వారా ప్రభుత్వం మానవీయ విలువలకు ప్రాధాన్యతనిచ్చిన మరో ఉదాహరణగా ఈ ఘటన నిలిచిపోతుంది.

**విద్యార్థుల కొరకు ప్రయోజనాలు:**
(ప్రీమియం Rs.218/- ఒక సంవత్సరానికి)
(వయస్సు 18 నుండి 60 సంవత్సరాల మధ్య)

**ప్రమాదంలో మరణించిన లేదా శాశ్వత అంగవైకల్యం కలిగిన**

- **బీమా చేయబడిన వ్యక్తి ప్రమాదం వలన మరణించినా లేదా శాశ్వత అంగవైకల్యం కలిగినా రూ.10 లక్షల ఆర్థిక సహాయం**
- ప్రమాదం వలన మరణించిన వారి భౌతికకాయాన్ని స్వదేశానికి తరలించడానికి లేదా అంగవైకల్యం కలిగిన వ్యక్తి స్వదేశానికి వచ్చేందుకు ఒక సహాయకునితో పాటు సాధారణ తరగతి విమాన ఛార్జీల చెల్లింపు

**ప్రమాదం వలన సంభవించే గాయాల వల్ల అస్వస్థతకు గురైతే**

- ప్రమాదం వలన సంభవించే గాయాలకు అయ్యే ఆసుపత్రి ఖర్చుల క్రింద లక్ష రూపాయల వరకు చెల్లింపు
- **ప్రమాదంకు గురై చదువు కొనసాగించడానికి అనర్హుడిగా గుర్తించినట్లైతే ఆ వ్యక్తికి, ఒక సహాయకునికి స్వదేశం వచ్చేందుకు సాధారణ తరగతి విమాన ఛార్జీల చెల్లింపు**

**కావాల్సిన పత్రాలు/ డాక్యుమెంట్స్ (ఉద్యోగులు, వలస కార్మికులు మరియు విద్యార్థుల కొరకు):**


- ఫాస్‌పోర్ట్ ఫ్రంట్ పేజీ
- పాస్‌పోర్ట్ బ్యాక్ పేజీ
- ఫారిన్ రెసిడెన్స్ ప్రూఫ్ (వీసా లేదా సివిల్ ఐడీ లేదా అకామా లేదా ఆఫర్ లెటర్)

24/7

మరిన్ని వివరాలకు
APNRTS 24/7 హెల్ప్ లైన్ నెంబర్
+91 863 2340678
వాట్సాప్ నెంబర్
+91 8500027678
insurance@apnrts.com ను సంప్రదించగలరు

NRT

"ప్రవాసాంధ్రుల సంక్షేమం, అభివృద్ధి మరియు భద్రతలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, APNRT సొసైటీ ద్వారా **"ప్రవాసాంధ్ర భరోసా బీమా"** పథకాన్ని అందిస్తోంది.



apnrts.ap.gov.in /APNRTS /APNRTSOfficial

**ఈ బీమా పొందాలంటే**

18 నుండి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన, ఉద్యోగులు, వలస కార్మికులు 3 సంవత్సరాలకు కేవలం రూ. 590/-లు మరియు విద్యార్థులు ఒక (01) సంవత్సరానికి కేవలం రూ.218/-లు చెల్లించి ఈ బీమా పొందవచ్చు

**ఉద్యోగులు, వలస కార్మికుల కొరకు ప్రయోజనాలు:** (ప్రీమియం Rs.590/- 3 సంవత్సరాలకు) (వయస్సు 18 నుండి 60 సంవత్సరాల మధ్య)

**ప్రమాదంలో మరణించిన లేదా శాశ్వత అంగవైకల్యం కలిగిన**

- **బీమా చేయబడిన వ్యక్తి ప్రమాదం వలన మరణించినా లేదా శాశ్వత అంగవైకల్యం కలిగినా రూ. 10 లక్షల ఆర్థిక సహాయం**
- ప్రమాదం వలన మరణించిన వారి భౌతికకాయాన్ని స్వదేశానికి తరలించడానికి లేదా అంగవైకల్యం కలిగిన వ్యక్తి స్వదేశానికి వచ్చేందుకు ఒక సహాయకునితో పాటు సాధారణ తరగతి విమాన ఛార్జీల చెల్లింపు
- **ప్రమాదం వలన మరణించిన లేదా శాశ్వత అంగవైకల్యం కలిగిన వారి కుటుంబ సభ్యులకు ఆసుపత్రి ఖర్చుల క్రింద బీమా కాలపరిమితి వరకు సంవత్సరానికి రూ. 50 వేల వరకు చెల్లింపు**




**కంపెనీ యాజమాన్యంతో న్యాయపరమైన సమస్యలకు**

ఉద్యోగ సమయంలో కంపెనీ యాజమాన్యంతో ఏదైనా సమస్యలు తలెత్తినట్లైతే, ఆ సమస్యల పరిష్కారానికి అయ్యే **న్యాయ పరిష్కార ఖర్చుల క్రింద రూ.45 వేల వరకు చెల్లింపు**

**ప్రమాదం వలన సంభవించే గాయాలు / అస్వస్థతకు గురైతే**

- **ప్రమాదం వలన సంభవించే గాయాలు/ అస్వస్థత చికిత్సకు అయ్యే ఆసుపత్రి ఖర్చుల క్రింద లక్ష రూపాయల వరకు చెల్లింపు**
- ప్రమాదం/అస్వస్థతకు గురై ఉద్యోగం చేయడానికి అనర్హుడిగా గుర్తించినట్లైతే ఆ వ్యక్తికి, ఒక సహాయకునికి స్వదేశం వచ్చేందుకు సాధారణ తరగతి విమాన ఛార్జీల చెల్లింపు

**మహిళా ఉద్యోగులకు**

బీమా చేయబడిన మహిళా ప్రవాసాంధ్రులు (ఉద్యోగులు) **బీమా కాలపరిమితిలో సాధారణ ప్రసూతి ఆసుపత్రి ఖర్చుల క్రింద రూ. 35 వేల** వరకు లేదా **సిజేరియన్ ఆపరేషన్ ఆసుపత్రి ఖర్చుల క్రింద రూ. 50 వేల** వరకు చెల్లింపు



# కాకినాడ కాజా
## (గొట్టం కాజా)

ఆంధ్రప్రదేశ్ తీపి వంటకాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న మిఠాయిలలో కాకినాడ కాజా లేదా గొట్టం కాజా ఒకటి. తూర్పు గోదావరి జిల్లా కాకినాడ పట్టణానికి చెందిన ఈ ప్రసిద్ధ స్వీట్, తన ప్రత్యేక రుచి, తెలుగు ప్రజల అభిమానాన్ని పొందింది. పండుగలు, వివాహాలు, శుభకార్యాలు, అతిథి సత్కారాల్లో కాకినాడ కాజా తప్పనిసరిగా కనిపించే తీపి వంటకం. కాకినాడ కాజా ప్రత్యేకత ఏమిటంటే, బయటకు బంగారు రంగులో కరకరలాడుతూ ఉండి, లోపల పాకంతో నిండిన మెత్తటి పొరలు ఉండటం. ఒకసారి కొరికితే నోటిలో కరిగిపోయే తీపి రుచి దీని ప్రత్యేక ఆకర్షణ. అందుకే దీనిని "గొట్టం కాజా" అని కూడా పిలుస్తారు. కాకినాడ కాజా తయారీ విధానం

### కావలసిన పదార్థాలు

- మైదా పిండి – 2 కప్పులు
- నెయ్యి లేదా డాల్డా – 3 టేబుల్ స్పూన్లు
- బేకింగ్ సోడా – చిటికెడు
- పెరుగు – 2 టేబుల్ స్పూన్లు
- నీరు – అవసరమైనంత
- నూనె – వేయించడానికి

### పాకం కోసం

- పంచదార – 2 కప్పులు
- నీరు – 1 కప్పు
- యాలకుల పొడి – అర టీస్పూన్
- నిమ్మరసం – కొన్ని చుక్కలు

### తయారీ విధానం:

మైదాలో నెయ్యి, పెరుగు, బేకింగ్ సోడా వేసి బాగా కలపాలి.

1. కొద్దికొద్దిగా నీరు పోస్తూ మెత్తగా పిండి కలిపి కనీసం 30 నిమిషాలు మూతపెట్టి ఉంచాలి.
2. పిండిని చిన్న ఉండలుగా చేసి పొడవుగా లేదా గొట్టం ఆకారంలో చుట్టాలి.
3. కడాయిలో నూనె వేడి చేసి, మంటను మధ్యస్థాయిలో ఉంచి బంగారు రంగు వచ్చే వరకు నెమ్మదిగా వేయించాలి.
4. మరో పాత్రలో పంచదార, నీరు వేసి ఒక తీగ పాకం తయారు చేయాలి. చివర్లో యాలకుల పొడి, నిమ్మరసం కలపాలి.
5. వేయించిన కాజాలను వేడివేడిగా పాకంలో 5–10 నిమిషాలు నానబెట్టాలి.
6. పాకం బాగా పట్టిన తరువాత బయటకు తీసి చల్లారనివ్వాలి.




info@apnrts.com
www.apnrts.ap.gov.in
/APNRTSOCIETY
/APNRTSOfficial
24/7 APNRTS హెల్ప్ లైన్
+91 863 2340678
+91 85000 27678

## ఆస్ట్రేలియా సెన్సస్ 2026

# మన తెలుగు భాషా వైభవాన్ని, ఐక్యతా బలాన్ని చాటుకుందాం!

ఆస్ట్రేలియా దేశం ప్రతి ఐదేళ్లకొకసారి నిర్వహించే అత్యంత కీలకమైన ప్రక్రియ సెన్సస్' (Census – జనాభా లెక్కల సేకరణ)ఇది కేవలం మనుషుల సంఖ్యను లెక్కించడం మాత్రమే కాదు రాబోయే ఐదేళ్లలో ఆస్ట్రేలియా ప్రభుత్వం కేటాయించే నిధులు, సౌకర్యాలు మరియు విధాన రూపకల్పనకు ఇది ఒక దిక్సూచి. ఈ సందర్భంగా ఆస్ట్రేలియాలోని తెలుగు వారందరికీ ఒక ముఖ్యమైన పిలుపు!



## 1. ఇప్పటివరకు ఉన్నతెలుగు వారిలెక్కలు (Statistics & Growth)

ఆస్ట్రేలియా బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ (ABS) అధికారిక గణాంకాల ప్రకారం:

**2016 సెన్సస్:** ఆస్ట్రేలియాలో తెలుగు మాట్లాడే వారి సంఖ్య 34,433

**2021 సెన్సస్:** ఈ సంఖ్య ఏకంగా 72.5% పెరిగి 59,406 కి చేరింది.

**ప్రస్తుత అంచనా (2026):** గత ఐదేళ్లలో మైగ్రేషన్ మరియు స్టూడెంట్ల సంఖ్య గణనీయంగా పెరగడం వల్ల, ఆస్ట్రేలియాలో తెలుగు వారి సంఖ్య 1,00,000 (లక్ష) మార్కును దాటి ఉంటుందని అంచనా.

**విశ్లేషణ:** ఆస్ట్రేలియాలో అత్యంత వేగంగా పెరుగుతున్న భాషా సమూహాలలో (Fastest Growing Communities) తెలుగు ఒకటి. అయితే, మనం ఎంతమంది ఉన్నామనేది మనం సెన్సస్‌లో రాసే Telugu అనే ఒక్క సమాధానం పైనే ఆధారపడి ఉంటుంది.

## 2. సెన్సస్ వల్ల ఉపయోగాలు (Key Benefits of Census Data):

మనం సెన్సస్‌లో సరిగ్గా వివరాలు నమోదు చేయడం వల్ల తెలుగు కమ్యూనిటీకి లభించే లాభాలు:

★ **స్థానిక నిధులు & లైబ్రరీలు:** తెలుగు మాట్లాడే వారి సంఖ్య ఆధారంగానే స్థానిక కౌన్సిల్స్ లైబ్రరీలలో తెలుగు పుస్తకాలు, పత్రికలు మరియు డిజిటల్ రిసోర్సెస్ కేటాయిస్తాయి.

★ **కమ్యూనిటీ రేడియో & మీడియా:** SBS మరియు స్థానిక కమ్యూనిటీ రేడియోలలో తెలుగు ప్రోగ్రామ్‌ల సమయాన్ని పెంచడానికి సెన్సస్ డేటా ప్రామాణికం.

★ **చిన్నారులకు మాతృభాషా విద్య:** మన పిల్లలకు తెలుగు నేర్పించే "మన బడి" లేదా లాంగ్వేజ్ స్కూళ్లకు ప్రభుత్వ గ్రాంట్లు, గదుల కేటాయింపు సులువవుతుంది.

★ **వృద్ధులు & సామాజిక సేవలు:** తెలుగు మాత్రమే మాట్లాడగలిగే వయోధికులకు (Seniors) ప్రభుత్వ కేర్ సెంటర్లలో తెలుగు అనువాదకులు (Translators/Interpreters) మరియు ప్రత్యేక సౌకర్యాలు లభిస్తాయి.

★ **రాజకీయ & సామాజిక గుర్తింపు:** మన సంఖ్య అధికారికంగా పెరిగినప్పుడు, ప్రభుత్వం మన కమ్యూనిటీ ఈవెంట్లకు (ఉగాది, దసరా వేడుకలు) పెద్ద ఎత్తున నిధులు ఇస్తుంది.

## 3. సెన్సస్ ముఖ్యమైన తేదీలు (Important Dates)

★ **ప్రధాన రోజు (Census Night):** ఆగస్టు 11, 2026 (మంగళవారం)

★ **నమోదు సమయం:** జూలై చివరి వారం నుండి ఆగస్టు 11 లేదా ఆగస్టు చివరి వరకు ఆన్‌లైన్ లేదా పేపర్ ద్వారా నింపవచ్చు.

★ **ఎవరెవరు పాల్గొనాలి?:** సిటిజన్లు, పి.ఆర్ (PR) హోల్డర్లు, వర్క్ వీసా, స్టూడెంట్ వీసాలు మరియు విజిటర్ వీసాల మీద వచ్చి ఆ రోజు ఆస్ట్రేలియాలో ఉన్న ప్రతీ ఒక్కరూ నింపడం తప్పనిసరి.

## 4. ఫారమ్ ఎలా పూర్తి చేయాలి? (How to Participate)

ఆస్ట్రేలియా బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ (ABS) ప్రతి ఇంటికి ప్రత్యేక Census Number మరియు Access Code తో కూడిన ఉత్తరం (Letter) పంపుతుంది.

**ఆన్‌లైన్ విధానం (ఆన్‌లైన్ - అత్యంత సులభం):**

1. census.abs.gov.au వెబ్‌సైట్‌కి వెళ్లండి.
2. మీకు వచ్చిన ఉత్తరంలో ఉన్న కోడ్‌తో లాగిన్అవ్వండి.
3. మీ ఇంటిలోని వారి వివరాలు నింపండి.

**పేపర్ ఫారమ్ విధానం:** ఆన్‌లైన్ వీలుకాని వారు ABS కి ఫోన్ చేసి లేదా వెబ్‌సైట్‌లో ఆర్డర్ చేసి పేపర్ ఫారమ్ తెప్పించుకుని, పూర్తి చేసి తిరిగి ఇచ్చిన


కవరులో పోస్ట్ చేయవచ్చు.

## 5. మనం చేయాల్సిన ప్రధానమైన పని (Crucial Action Step)

ఫారమ్ నింపేటప్పుడు భాషకు సంబంధించిన ప్రశ్న దగ్గర అత్యంత జాగ్రత్తగా ఉండాలి: **ప్రశ్న:** What language does the person use at home? (లేదా ఇంట్లో మాట్లాడే భాష)

**మీరు చేయాల్సింది:** Other – please specify అనే ఆప్షన్ ఎంచుకుని, స్పష్టంగా Telugu అని రాయాలి/టైప్ చేయాలి.

**గమనిక:** ఇంట్లో కాస్త ఇంగ్లీష్ మాట్లాడినా, మీ ప్రాథమిక భాష లేదా మూల భాష తెలుగు అయితే తెలుగు అని మాత్రమే నమోదు చేయండి.




## 6. మన అవగాహన — మన బాధ్యత (Conclusion)

మనం విదేశాల్లో స్థిరపడినా, మన గుర్తింపును చాటుకోవడానికి సెన్సస్ ఒక చట్టబద్ధమైన సాధనం. మనం ఐక్యంగా పాల్గొని మన ఉనికిని నమోదు చేయకపోతే, మన సంఖ్య తక్కువగా చూపించబడి ప్రభుత్వ నిధులు, సౌకర్యాల విషయంలో మన కమ్యూనిటీ వెనుకబడిపోయే ప్రమాదం ఉంది.

భాష మన సంస్కృతికి మూలం — సెన్సస్‌లో తెలుగు అని రాయడం మన కమ్యూనిటీ భవిష్యత్తుకు మార్గం.

## మీ పాత్ర:

★ మీ ఫారమ్‌లో Telugu అని నమోదు చేయండి.

★ మీ పరిధిలోని వాట్సాప్ గ్రూప్‌లు, ఫేస్‌బుక్ ద్వారా ఈ సందేశాన్ని ప్రతి తెలుగు కుటుంబానికి చేరవేయండి.

★ కొత్తగా వచ్చిన స్టూడెంట్లకు, ఆన్‌లైన్ ఫారమ్ పూర్తి చేయడంలో ఇబ్బంది పడే పెద్దవారికి సహాయం చేయండి.

తెలుగు వారందరూ ఐక్యంగా ఈ సెన్సస్‌లో పాల్గొని, ఆస్ట్రేలియా గడ్డపై మన తెలుగు భాషా ప్రాధాన్యతను, కమ్యూనిటీ బలాన్ని స గర్వంగా చాటుకుందాం!

**జై తెలుగు తల్లి!**

**నరేంద్ర బాబు. కుక్కపల్లి**
**ప్రవాస ఆంధ్రులు**
**ఆస్ట్రేలియా (మెల్బోర్న్ )**




*Powered by* NamastheAndhra.com